# పలాయితుడు

నా జీవితంలో పోట్లాడి స్నేహితులెలా కావచ్చో చూపించిన వాడు రాజశేఖరం. ఆయన నుండి నేర్చుకోదగ్గవి చాలా ఉన్నవి. కాని నా జీవితంలో ప్రవేశిస్తూ నేర్పినదీ – యీ రెండు పాఠాలూ నేనెన్నడూ మరువలేను.

ఆయనా నేనూ ముఖాలు చూచుకున్నది మొట్టమొదట ఒక సినీమా హాల్లో, సీట్ల వద్ద. ఒక సీటుకై పోట్లాడుకుంటూ ఇద్దరం పరిచితులయ్యాం. అప్పటికి నాకు ఇరవై రెండేండ్లుంటాయి.

కుర్చీకి జేబురుమాలను కాపుపెట్టి నేను బయటికి పోయేను. తిరిగి వచ్చేసరికి చక్కగా అందులో ఈయన అధిష్ఠించి ఉన్నారు. ఖద్దరు కళ్ళీ లాల్చీ పైజామాలలో – అప్పటికాయనకు దగ్గర దగ్గర పాతికేండ్ల వయసై ఉండవచ్చు. ప్రక్కన యింకొక స్థూలకాయుడు ఆయన వయసువాడే ఉన్నాడు. వాళ్ళిద్దరూ చాలా గంభీరంగా ఏదో ఒక మహత్తర విషయంపై చర్చించేసుకుంటున్నారు. నా స్థలం దురాక్రమణ చేశారనుకోవటం వల్లకన్నా వాళ్ళేదో తమాషాచేసి నటన సాగిస్తున్నారనిపించడంతో నాకూ పట్టుదల కలిగింది. నా స్థలం ఖాళీ చేయమన్నాను. రాజశేఖరంగారే పసిమి మించిన తెలుపు వర్ణంగల తమ పలుచని కోలమొఖాన్ని నా వంకకు త్రిప్పి 'ఎందుకూ?' అన్నారు. ఆ చూపూ, ఆ ప్రశ్నించే ధోరణీ నన్ను మరీ ఉద్విగ్నుణ్ణి చేశాయి, చెప్పేను – చాలా గంభీరంగా సీరియస్‌గా రెండు మూడు వాక్యాల్లో – అది నా స్థలం అని.

"మాకేం తెలుసూ, దానిమీద అలా అని ఏమీ వ్రాసి లేదు" అన్నారాయనే.

నేను చప్పున ఉద్రిక్తుణ్ణవుతూ "వ్రాసిపెట్టే పోయేను – చూడగలిగితే" అంటూ దురుసుగా వంగి నేలను పొర్లాడుతున్న రుమాలును తీసి దులిపి వారి కండ్ల ముందుంచేను.

వాళ్ళు నా ప్రవర్తనకు విస్తుపోయుండాలి. ఒకసారి ఒకరి ముఖం ఒకరు చూసుకొని పిదప నా ముఖంలోకి చూస్తూ ఊరుకున్నారు. కొంత సేపయాక ఆ ప్రక్కాయన "పోనీ యిన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడ కూర్చుంటే వద్దన్నాయండీ?" అన్నాడు నెమ్మదిగా.

"ఆ ఉదారత్వం తామే ఏల ప్రదర్శించరాదు?" అన్నాను నేను.

వారు క్షణకాలం నిరుత్తరులై పోయేరు. తరువాత రాజశేఖరం గారు అకస్మాత్తుగా లేచిపోతూ ఇంగ్లీషులో "సరే సరే మీ అమూల్యమైన సలహాకు ఇవే నా అనంతమైన ధన్యవాదాలు" అన్నారు.

– అంటూ అందులో ఆ చివరి పదాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో ఉచ్చరించడం ద్వారా చేయగలంత అపహాస్యానికీ నన్ను గురిచేసి అక్కడ నుండి ఇంకోచోటికి వెళ్ళిపోయేరు.

నా వళ్ళు తెగ మండిపోయింది. అయితే అది – ఓడిపోతూ ఓటమితో గెలుపును పొందగల అవతల వ్యక్తి ఔన్నత్యం గ్రహించటం వలన కలిగే స్పర్థ వల్లకాదు. ఆయన పోకడను – ఓడిపోతూ గెలిచిన ధోరణి ప్రదర్శించుకునే ఒక విచిత్ర పద్ధతిగా అపార్థం చేసుకున్న అహంకారం వల్ల.

ఈవిధంగా ప్రారంభమైన మా పరిచయం యింతకన్నా అనహ్యాకరమయిన మరి ఒక పోట్లాటతో సన్నిహిత పరిచయంగా రూపొంది, కడకదే స్నేహమయ్యింది.

మాది పల్లెటూరు. పట్నంలో ఉద్యోగరీత్యా నివాసం. అప్పటికి నాకింకా పెండ్లి కాలేదు. అందుచేత హోటల్‌లో భోజనం చేస్తూ ఒక గది అద్దెకు పుచ్చుకొని ఒంటరిగా వుంటుండే వాడిని.

హోటల్లో టేబుల్ మీల్సు పద్ధతి ఇంత బహుళంగా వ్యాప్తంకాని రోజులవి. ఒకనాడు భోజనం చేస్తుండగా నా పంక్తి కెదురుగుండా ఉన్న పంక్తిలో సరిగా నాకెదురుగా పూర్వ పరిచితమయిన ముఖం ఒకటి కానవచ్చింది. పదే పదే ఆయన, నావంక చూస్తూ రావటం చేతనే ఆయన ఎవరా అన్న సందేహంలో పడ్డాను. కాని ఎంత ప్రయత్నించినా ఎక్కడ చూశానో జ్ఞాపకం రాలేదు. కడకాయన భోజనం ముగించి లేచి చేయి కడుక్కోడానికి పోతూ చేసిన సాంకేతిక హాసంతో గుర్తుకు వచ్చింది.

తరువాత అప్పుడప్పుడూ మేం అక్కడే తారసపడుతూ వుండేవాళ్ళం. అతనెప్పుడెదురు పడినా అతని కండ్లలోకి సూటిగా చూడటానికి నాకు ముఖం చెల్లేది కాదు. బహుశా ఆనాడు హక్కు నిలబెట్టుకోడమనే మిషతో ఒక స్వల్ప విషయాన్ని ఘనంగా చేసి అనవసరమైన ఉద్రేకాన్ని ప్రదర్శించడంలో గల అల్పత్వాన్ని నేను ప్రత్యక్షంగా గుర్తించక పోయినా బాగానే ఆయన గుర్తించి ఉండాలి.

ఏమైనా అతడు నన్ను విడువలేదు. వేరొకనాడు నేను హడావుడిగా భోజనశాలలో ప్రవేశించి సగం నిండిన పంక్తిలో వెళ్ళి వరసలో కూర్చుంటున్నాను అప్పుడే నాకన్న ముందు స్థలంలో కూర్చుంటున్న పెద్దమనిషి "నేను బహుశా మీ కోసం అట్టేపెట్టుకున్న స్థలాన్ని మరింకోసారి దురాక్రమణం చేయడం లేదనుకుంటాను" అన్నాడు నెమ్మదిగా! నేను తలెత్తి చూశాను. అతనే. ఆయన ముఖాన వెలుగుతున్న నిష్కల్మషమైన హాసరేఖ

అన్నినాళ్ళయీ నా హృదయాన్ని అంటి పెట్టుకుని ఉన్న కల్మషాన్ని చాలావరకు కడిగేసి ఉండాలి. అందుచే లోపల "చిత్రమైన మనిషి" అనుకుంటూనే బయటికి 'అబ్బే! లేదు' అన్నాను.

మేమిద్దరం భోజనం చేసిన ఆ పావుగంటలోనూ ముక్తసరిగా రెండే రెండు ప్రశ్నలు వేశారు – ఆయన! మొదటిది నా పేరును గురించి. రెండోది నా ఉద్యోగం గురించి. నేనా రెండిటికి సమాధానాలిచ్చేను. అంతే. అంతకు మించి సంభాషణను పెంచటానికి అప్పట్లో నా స్వభావం అంగీకరించలేదు. చాలానాళ్ళ వరకూ, ఎన్నోసార్లు కలిసి మాటాడినా ఆయన పేరైనా తెలుసుకోలేదంటే అప్పటి నా ధోరణి ఎలా ఉండేదో అర్థమౌతుంది.

కాని ఆయన యింకొకనాడూ మరి ఒకనాడూ కూడా నన్ను మాట్లాడించి చివరకు ఉన్న గుట్టు విప్పి ప్రశ్నించారు.

''మీరింకా సినిమాహాలు సంఘటన మరిచిపోలేదనుకుంటాను" అన్నారు నవ్వుతూ.

ఈ విసురు నామీద కాస్త పనిచేసింది. నేనెంత ఉదాత్త స్వభావుణ్ణో వివరించడానికి ప్రయత్నించాను కాస్తసేపు. కాని ఆయన 'వున్న సంగతి చెపుతున్నాను' అంటూ జరిగినది చెప్పారు. వారు వచ్చేసరికే రుమాలు క్రిందపడి వున్నది. నేను చూసేవరకూ వారు దానిని చూడలేదు. అది విన్నాక కొంత కల్మషం విడిచి మాటాడాను.

తదాది మా పరిచయం ఏ స్థితికి వచ్చిందంటే అతడు కనపడ్డప్పుడల్లా మాట్లాడమే కాకుండా రీడింగ్‌రూమ్ నుంచి నే తెచ్చుకునే పుస్తకాలు చూడడానికి అడిగి చదివి యిచ్చేస్తానని పట్టుకుపోవడం, ఆయన ప్రతిసారీ వాగ్దానం ప్రకారం సకాలానికే తిరిగి యిచ్చినా నేను ప్రతిసారీ ఏడుస్తూనే యివ్వడం, అయినా అతనా సంగతి గ్రహించక పుస్తకాలు ఇచ్చిపుచ్చుకు నేందుకు నా గదిని కూడా పట్టుకుని అక్కడకే రాకపోకలు సాగించటం, రాకపోకలు ఒక స్థితికి వచ్చేక నేను గది విడిచి బయటకు పోవలసి ఉన్నా ఆయన కోసం విసుక్కుంటూ అక్కడే ఉండటం, లేకపోతే గది ఆయనకే అప్పగించి నా పనులు చూసుకురావటం, అయినా అతను తన పద్ధతి మార్చుకోక పోవటం, పైగా అప్పుడప్పుడూ అతని కాఫీ ఖర్చులూ, సినీమా ఖర్చులూ భరించవలసి రావటం – ఇదంతా చివరికి నాకెలా అనిపించిందంటే ఏదో అత్యాచారంలా అనిపించింది.

అతని విషయమై నేనెంత తటస్థంగా ఉన్నా, ఈలోగా, అతని గురించి కొన్ని విషయాలు తెలిసేయి. అతని పేరూ, అతని కాలేజీ చదువూ, ముఖ్యంగా అతనికి సరియైన ఉద్యోగమేదీ లేదనీ, హార్బర్‌లో ఏదో బ్రాహ్మణాత్తపు ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. బహుశ అందువల్లే అతని ధోరణి అత్యాచారంగా నాకు కనిపించిందేమో.

వెంటనే ఆయనను వదిలించుకోవటానికి పద్ధతులూ, అందుకుగాను నా అంతరాత్మకు చెప్పుకునేందుకు సమాధానాలూ, వెతుక్కోవలసి వచ్చింది.

అంతరాత్మ వ్యవహారం ఏదో మసిపూసి మారేడుకాయగా చేసి ఫైసలు చేసేను. పద్ధతి దగ్గరకొచ్చేసరికీ ఒక మొండిపద్ధతి ఎన్నుకున్నాను.

ఒకనాడు – నాలో ఎంతటి అమానుషత్వం అంతర్గతంగా తలదాచి ఉన్నదో అంతటి అమానుషత్వాన్నీ ఉన్నంత నగ్నంగానూ ప్రదర్శించి ఆయన నుండి విడివడటానికి నిశ్చయించేను.

నిజంగా అది దుర్దినం. నా కండ్లను ఆ దౌర్భాగ్యపు పొరలు అంత దట్టంగా కాక ఏ కాస్త తక్కువగా ఉన్నా అతను ఏ స్థితిలో నా వద్దకు వచ్చి వుంటాడో చూడగలిగి ఉండేవాణ్ణి. కాని అట్లా జరగలేదు.

ఆయన వస్తూనే ఎన్నడూ లేనిది చాలా గడబిడగా గొడవ గొడవగా మాటాడనారంభించారు.

"...చూడండీ! మీరీవేళ కనీసం ఒక స్వీటూ రెండు హాట్లూతోనైనా కాఫీ ఇప్పించాలి. తొందరగా లేవండి" అంటూ నా సూట్‌కేసు సోఫాగా చేసుకొని "చాలా ఆకలివేస్తోంది త్వరగా తెమలండి. మీరింత వేగిరం బయలుదేరే ఉద్దేశంతో లేకుండా ఉంటే ఆ జేబులో ఏమైనా వుంది కాబోలు, ఇలా పడేయండి" అంటూ త్వరపెట్టసాగారు.

ఇలా అనటం ఆయనకు పరిపాటి కూడా కాదు. నిశ్చయంగా అదే మొదటిసారి.

నవ్వటంచేతకాని ఆ గంభీర వదనాన్ని అసహజమైన నవ్వొకటి సౌందర్యాంధునికి కూడా స్పష్టంగా కానవచ్చేటంత విలక్షణయుతంగా మార్చి ఉండటం, మెరిసే ఆ కండ్లలో ఏదో విపరీతమైన చూపు వ్యక్తమౌ తుండటం నేను నా ధోరణిలో గమనించగలిగి ఉండను. గమనించినా వానిని కూడా నా ధోరణికి అనుకూలమైన పద్ధతిలో అనువదించుకొని ఉంటాను.

అందుచేతనే నా అపక్ర విక్రమ సాహసాలను ప్రదర్శిస్తూ అన్నాను.

"మీకు స్వీట్లూ హాట్లూతో కాదుకదా ఒట్టి కాఫీ కూడా నేను పోయ దలచుకోలేదు నా జేబులో చాలా డబ్బులున్నాయి. కానీ మీకు ఒక్క దమ్మిడీ అయినా యీయను. దయచేసి మీరు నన్ను వేధించకండి. ఇంక ముందు నిత్యం మీరిట్లా

నా గదికి వచ్చి నా కిబ్బంది కలిగించడం నేను భరించను. మీరింక నా గదికి రాకండి” అన్నాను.

వాక్యపద్ధతిలోనే కాకండా స్వరంలో కూడా కర్కశత్వం తెచ్చి పెట్టుకుంటూ నేనిట్లా అనేసరికి ఆయన పాపం ఆశ్చర్యంగా తలయెత్తి చూశాడు. నా ముఖంలో ఆయన ఏం చూశాడో గాని నేనాయన పశిమి మించిన తెల్లని ముఖం చూస్తూ ఉండగానే ఎఱుపు నుండి తెలుపునకూ తెలుపు నుండి నలుపునకూ రంగులు మారడం గమనించాను. కాని ఆ క్షణాన దాక్షిణ్యమనేది మరీ అంత పూర్తిగా నాలో ఎట్లా మాయమయ్యిందో తెలియదు. అతనట్లా పిడుగడచిన చందాన నిస్తేజుడై నిశ్చలంగా ఉంటే నేనింకా వాగసాగాను–

“నేను హాస్యమాడడం లేదు. మీరు ఇంక ముందు నా గదికి రావద్దు”.

తొలిదెబ్బ నుండి తేరుకోడానికే కొంతసేపు పదుతుంది. దానిపై రెండవ దెబ్బ కొంత సమయం తీసుకొని కోలుకున్నాక అన్నాడు–

‘‘అంటే?’’ అన్నారు సరిగా పెగలని గొంతును సరిచేసుకుంటూ.

కాని అహంభావ ధోదూయ మానసునకు కన్నే కాదు, ఇంద్రియ పంచకంలో ఏ ఒక్కటీ సరిగా పనిచేయదు.

“అంటే – అంటే అనటానికిందులో ఏమీలేదు. ఇది నా గది. ఇందులోనికి రావద్దనటానికీ, ఏల రారాదనే విషయమై మీకు నేను సంజాయిషీ యిచ్చుకోడానికీ అవసరం లేదు. నాకిష్టం లేదు. కాబట్టి రావద్దు” అన్నాను.

ఈ మొండి జవాబుతో అతను నిరుత్తరుడై ఊరుకున్నాడు. కాని అతని ముఖంలో ముఖ్య కండరాలన్నీ యీ మహావమాన జనితమయిన ఉద్వేగ తీవ్రతచే కంపిస్తున్నాయి. ఆ అభిమాని తన వేదనని వ్యక్తం కానీయటం యిష్టంలేక పలుచని పెదవులు ఎంత అదిమిపెట్టి వుంచినా అవి తమ పని మానలేదు. ఒకటి రెండుసార్లు గుక్కిళ్ళు మింగి కూడా వానిని వశపరచుకోలేకపోయారు.

ఐదు పది ఇరవై ముప్పై సెకన్ల వరకూ ఇద్దరం చిత్ర ప్రతిమలులా మిగిలిపోయాం.

ఆయన యెంత నిగ్రహ స్వభావుడైనా నేను చేసిన అవమానం ఆ నిగ్రహాన్ని మించినది.

చూస్తుండగానే ఆయన ఉత్తమాంగం చలింపనారంభించింది. చలన తీవ్రత క్రమ క్రమాభివృద్ధి కాగా చివరికి ఆపాదమస్తకం వణికిపోతూ చప్పున నిలుచున్నారు. ఆ చూపులకే సామర్థ్యం ఉంటే అంతవరకూ ఆయన చూసిన చూపులకు నేను మసికావలసి ఉండెను.

అలా చూస్తూనే ఆ మూసివున్న పెదవులూ కరచుకొని ఉన్న పండ్లూ కాస్తగా విప్పి –

“సరే” అన్నారు.

అట్లా అని మరికాస్త సేపట్లో చట్న వెనుదిరిగి నా గది విడిచి మెట్లు దిగి వెళ్ళిపోయారు.

నేను కొంతసేపు పోయాక ఒక దీర్ఘ నిశ్వాసం విడిచేను. తరువాత కూర్చున్న చోటు నుండి లేవబోయాను. కాని అప్పటికి కూడా నా కాళ్ళు వణుకుతున్నాయి. ఎందుచేతా అంటే నాకప్పుడు తెలియదు. అంతరాంతరాల్లో కారణమేదో సూచితమౌతున్నా దానిని నేను నిరాకరించాను.

ఆనాడల్లా ఏ పనీ చేయలేకపోయాను. మనస్థిమితం లేకుండా ఎక్కడెక్కడో తిరిగాను.

తరవాత కొంతకాలం సర్వకాల సర్వావస్థలలోనూ ఆయన గురించీ ఆ సంఘటన గురించే ఆలోచించేను. ఆయనకు నేను చేసిన మహావమానానికి తగిన కారణాన్ని ఎంత వెదికినా ఆయన నడవడిలోగాని, మాటలలోగాని పట్టుకోలేకపోయాను. చివరకు మొండికెత్తి, ఏదో అయ్యింది అని అంతా మరిచిపోడానికి ప్రయత్నించాను.

అయితే, యీ స్వార్థపరునీ, అహంభావినీ, సంస్కరించాలనే పట్టుదల ఆయనకు ఏల కలిగిందో తెలియదు. నా ముఖం యీ జన్మలో మళ్ళా చూడరనుకున్నాను. కాని అలా జరగలేదు.

ఒకనాడు ఉదయాన్నే నేను నూతి వద్ద స్నానంచేసి గదికి వచ్చేసరికి మూసి ఉంచిన నా గది తలుపులు తెరచి వున్నాయి. అందులో యీ నాస్తికుని పూజలందుకో వచ్చిన దేవతా మూర్తిలా ఆయన ఎదురుగా నిలుచుని ఉన్నారు. నిష్కల్మషమైన హాసరేఖ అతని ముఖాన్ని ఉద్దీపితం చేస్తూ వున్నది.

నేను క్షణకాలం నిచ్చరబోయాను. తరువాత గదిలో ప్రవేశించి తొందరగా బట్టలు వేసుకొని ‘పదండి’ అన్నాను. గది తాళం పెట్టి చకచకా అతని ప్రక్క ప్రక్కగా మెట్లు దిగుతూ వుంటే నా శరీరం గాలిలో తేలిపోతున్నట్టయింది.

## 2

ఇది జరిగి పదేండ్లయ్యింది. నాటి నుండి నేటివరకూ మేము స్నేహితులమే, కాని ఆయన స్వభావం, చరిత్రా మాత్రం యీనాటికీ నాకు నిత్య నూతనములు.

మేము మూడేళ్ళు ఒకే గదిలో ఉన్నాం. ఆహార శయ్యాసన విహారాదులలో ఎన్నడూ ఒకరినొకరు విడచినది లేదు.. మా వస్తువులూ, దుస్తులూ చివరకు పర్సులు కూడా సమిష్టిగా వాదుకున్నాం. నా పెండ్లికి పిదప గదినుండి వీడిపోయినా ఒక యేదాది ఒకే ఊరిలో ఉన్నాం. నిత్యం కలసే వాళ్ళం.

ఆ చివరి రోజుల్లో అతను కూడా కుటుంబాన్ని తీసుక వచ్చాక కొంత యెడబాటు యెక్కువైనా తరుచు కలుసుకునే వాళ్ళం. అయినా అంతకాలంలోనూ ఆయన గురించి నాకు తెలిసిందల్లా అతనికి వివాహమయ్యిందనీ, తల్లీ తండ్రీ లేరనీ, ఒక్క అన్నా ముసలి నాయనమ్మా మాత్రం ఉన్నారనీ ఆస్తులేమీ లేవనీ, ఆయన నిజమైన జీవితంతో పరిచయం ఆయనను విడిచి పెట్టాకే ప్రారంభమయ్యింది.

నాకు క్రొత్తగా బదిలీ అయిన వూరు ఒక చిన్న పట్టణం. వెళ్ళిన తొలి రోజుల్లో అక్కడి వీధులూ బజార్లూ ఇళ్ళూ సంకుచితంగా, చిన్నవిగా కానవచ్చినట్లే మనుష్యుల హృదయాలూ సంస్కారాలూ కూడా 'సంకుచితంగా' నాసిరకంగా కానవచ్చేవి. అందుచే చాలా కాలం వరకూ అక్కడి జనాలతో కలిసి తిరగలేక పోయే వాణ్ణి. కాని ఒంటరితనం బహు దుర్భరమైనది. అందుచేత వాళ్ళ మాటలనూ చేష్టలనూ, స్వభావాలనూ నేనెంతగా అసహ్యించుకుంటూ వచ్చినా కాలక్షేపానికి వాళ్ళతో తిరగక తప్పింది కాదు.

వాళ్ళంతా రోజూ ఊరు నడుమ ఉన్న చిన్న పార్కులో చేరి ఒక మారుమూల కూర్చుని బాతాఖానీ ఆరంభించేవారు. వారు మాటాడే విషయాలు సాధారణంగా ఏపై అధికార్లను గురించో, వాళ్ళ భార్యలను గురించో, లేక తమ తమ చిన్ననాటి ముచ్చట్లో, అవీ యివీ కాకపోతే ఇరుగు పొరుగుల ఆడవాళ్ళ గురించో అయివుండేవి. అందులో ఆడవారి గురించిన ప్రసంగమైతే ప్రతి ఒక్కడూ కలుగజేసుకొని నోటిదత్తి తీరా అవ్వాకులూ చవ్వాకులూ వాగి సంతృప్తి పడుతుండేవారు.

ఒకసారి దురదృష్టవశాత్తు యీ మహానుభావుల నడుమనే రాజశేఖరం గారి పూర్వగాథ యిరుక్కున్నది.

ఆవేళ వారు, ఎవరో ఉద్యోగం పోగొట్టుకున్న ఒక కుర్ర గుమస్తా గురించి చెప్పుకుంటున్నారు. 'ఫూల్' అని ఆఫీసరు అవమానిస్తే కోపం వచ్చి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడట. వాడి తెలివితేటలూ, చురుకుదనం మొదలైన వాటిని మెచ్చుకుంటూనే 'ఎన్నుంటే ఏం లాభం? పెడసరపు బుద్ధి ఉన్నాక ఎన్ని గుణాలున్నా రాణించవు' అంటూ – ఆఫీసరనే వాడిని ముఖం ముందు స్తుతిస్తూ, గులాంలా చిత్తం చిత్తం అని, ముఖం చాటవగానే తమలా కసిదీరా తిట్టుకొని సంతోషించడం చేతకాని ఆ కుర్రవాని తెలివితక్కువను గురించి నలుగురూ నాలుగు విధాలా చెప్పుకొని నవ్వుకుంటున్నారు.

ఆ సందర్భంలోనే "నేనూ ఎరుగుదును ఒకణ్ణి– " అంటూ ఒక పెద్ద మనిషి రాజశేఖరంగారి పేరెత్తాడు. ఆయన తాలూకా ఆఫీసు ఉద్యోగం ఎలా పోగొట్టుకున్నాడో చెప్పబోతుంటే సాంబమూర్తి అందుకున్నాడు.

ఆ బృందం అందరిలోనూ నేనెక్కువగా అసహ్యించుకునేది ఆ వ్యక్తినే. ఆ లక్షింపతిగాడికి తెలియని భోగట్టాలూ, వాడెరగని మనుష్యులూ లేనట్టు మాటాడుతాడు. ఎలా సంపాదిస్తాడో ఆ పరిచయాలూ చరిత్రలూ, తెలియదు. అందర్నీ తెలుసునంటాడు.

అందరి పుట్టు పూర్వోత్తరాలూ వల్లిస్తాడు. వాటికి వాడిచ్చే రంగులెట్టా ఉన్నా ప్రతికృతుల సత్యతలో లోపముండదు. అదే కొంత సుగుణం. ఆ పెద్దమనిషి రాజశేఖరం గారిని చిత్రించ నారంభించేడు.

అంతవరకూ మెడపై తలను ప్రక్కకు వంచి కనుబొమలు రెండూ ముడివేసి వింటున్నవాడల్లా సందేహస్మృతి సూచకములైన చూపులూ స్వరాలూతో – 'ఏ రాజశేఖరం?... రాజశేఖరమేనా?' అన్నాడు బొంగురు గొంతు సరిచేసుకుంటూ.

మొదటివాడు అవుననగా–

"వాడా! వాడిని నేను బాగా ఎరుగుదును. వాడొక కొజ్జా. గర్వం అతిశయం చూడబోతే పట్టపగ్గాలుండవు. ఫోజులిస్తాడు – ఫోజులు!" అన్నాడు.

అన్యులనట్టా అనవసరంగా అవహేళనం చేయటంతో, అందులో నేనెరిగిన రాజశేఖరం గూర్చి అలా కారుకూతలు కూయడంతో, తద్వారా అతి హీనమైన ఆనందాన్ని పొందజూచే ఆ వ్యక్తి నైచ్యాన్ని చూసేసరికి, నాకు ఒళ్ళు మండుకు పోయింది.

"మీరు పరీక్షించారా ఆయన పుంస్త్వాన్ని?" అన్నాను వ్యంగ్యంగా – కాని ఆ దున్నపై అట్లాంటి సున్నితమైన ఆయుధాలేమీ పనిచేయవు. మీద ఏమైనా పడినపుడు దున్న ఎలా తల విసిరి కొడుతుందో సరిగా అలాగే తల విసిరి, కసిరి కొడుతున్నట్టు అన్నాడు.

"బాగుంది! నాకు తెలియదంటారేమిటి? వాడిదీ మాదీ ఒకటే ఊరు ఇంతప్పణ్ణుంచీ వాడిని నేనెరుగుదును. ఆమధ్య నేనూ, నారాయణరావూ విశాఖపట్నం వెళ్ళినప్పుడు దారిలో ఎదురువడ్డాడు. నాతో ఎంతసేపు మాటాడాడో నారాయణరావుని అడగండి" అన్నాడు బుసలు కొడుతూ.

ఆ మందకు సాంబమూర్తి కథలు మహాయిష్టం. కారణం వేరే చెప్పనక్కరలేదు. అందుచేత అతన్ని వెనకేసుకు వస్తూ నన్నూరుకోమని అతన్ని చెప్పమన్నారు.

కర శిరశ్చాలనాలతో వాక్ నేత్రాభినయనాలతో మహా కథన కౌశలంతో చెప్పిన దాని సారాంశం ఇదీ.

రాజశేఖరం తండ్రి నాన్ కో ఆపరేషన్ గొడవలలో ఒకటో రకానికి చెందిన ఉద్యోగానికి చేజేతులా తిలోదకాలిచ్చుకున్న మూర్ఖుడట. రెండుసార్లు జైలుకువెళ్ళి పోలీసులచే మెత్తగా ఒళ్ళంతా మర్దన చేయించు కున్నాడు. కొసకా జైలులోనే చచ్చిపోయాడు కూడా – నోట తులసీతీర్థం పోసే దిక్కయినా లేకుండా. చచ్చే ముందు ఏ కడజాతివాడో ఇన్ని మంచినీళ్ళు పోసి ఉంటాడు.

ఆరుమాసాలు తిరగకుండా వాళ్ళమ్మ కూడా చచ్చిపోయింది. బహుశా బెంగవల్లే చచ్చి వుంటుంది.

వాళ్ళు ముగ్గురు అన్నదమ్ములు. ఆడగుంటలు లేరు. అప్పటికి ఇంతా ఇంతాగా ఉండేవారు. పెద్దవాడు తన తోటివాడు. మరికొన్నాళ్ళకి స్ఫోటకం వచ్చి పోయాడు.

వీళ్ళని నాయనమ్మ పెంచింది. ముసలిది ఇప్పటికీ గుండు ముక్కలా తిరుగుతుంటుంది. (ఇక్కడ సాంబమూర్తి గారు ఆ గుండుముక్క లాంటి నాయనమ్మ బోడిగుండును గురించి కనీసం ఐదు నిముషాలు మాటాడి ఉంటారు) మగ సహాయం ఊరులోనే వున్న మేనమామల వల్ల పొందారు. కొద్దిగా భూములున్నాయి. వీడికన్నా పెద్దవాడు యిప్పటికీ ఆ భూములమీదే ఆధారపడి బ్రతుకుతున్నాడు.

వీడికి ఆ మేనమామ తన మూడో కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశాడు. మేనమామ పెళ్ళం ఒక పిల్లల కోడి. వరుసగా ఇద్దరు మగపిల్లల్నీ నలుగురు ఆడపిల్లల్నీ కనీసి, మొత్తం అరడజనూ పూర్తిచేసి, కానుపులు ఎత్తి కట్టేసింది. అప్పటి నుండీ బాగా బలిసి ఇప్పుడు గుండ్రంగా అణా రొట్టెలా ఉంటుంది. మామగారు సన్నగా రివటలా పొడుగ్గా వుంటాడు.

వాళ్ళు వీడికి బి.ఎ. వరకూ చదువు చెప్పించటానికే సిద్ధపడ్డారు. మనవాడికి విజయనగరం కొళాయి నీళ్ళు ఒంటికి సరిపడక, ఇంటరు చదువుతూనో చదివి పాసయ్యాకో, ఇంటికి వచ్చేశాడు.

ఇంతలో ఆ పిల్ల పెద్దదయింది. కార్యం చేసుకోమంటే... చేసుకోడు.

అటు చదువూ లేకుండా, ఇటు వుద్యోగమూ లేకుండా, పోనీ సాగుబడి కార్యక్రమంలోకి దిగమంటే అదీ లేకుండా రెండేళ్ళు రికామీగా గొడ్డులా తిరిగాడు.

తరువాత రెండు మూడు వుద్యోగాలు చేసి బుర్రతిరుగుడు ఫలితంగా ప్రతిచోటా శ్రీముఖాలు పుచ్చుకొని చివరికా చెల్లని దమ్మిడీ విశాఖపట్నం చేరుకొని ఇప్పుడక్కడ చలామణీ ఐ పోయింది. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఏదో పనికి కుదురుకున్నాడు. అయితే అక్కడైనా స్థిరంగా ఉంటాడన్న సిద్ధాంతమేమీ లేదు.

ఇక్కడి వరకూ చెప్పి అలసిపోవడంచేత కాబోలు ఆ ఉపన్యాసకుడు కొంచెంసేపు ఆగాడు. కాని అతని శ్రోతలు అతనిని విడువలేదు. అసలు సంగతి చెప్పావే కాదు. చెప్పవలసినదంతా ముందే ఉంది అంటూ అతణ్ణి ఎగసన దోసేరు.

వాడి ధర్మమా అని, తన సిద్ధాంతాన్ని ఋజువు చేసుకునేందుకు సాంబమూర్తి కల్పనను ఆశ్రయించలేదు. ఒత్తి అనుమానోపపత్తితో విడిచి పెట్టేడు.

సినీమాలూ నవలలూ బహుళ ప్రచారములో నున్న యీ రోజుల్లో, ముప్పై ఏండ్లు పైబడ్డా యీడేరిన భార్యను ఎదుట నుంచుకొని కార్యం చేసుకోవటానికి మొగ్గలేదంటే, ఆ మనిషిలో లోపమేదో వుండే వుండాలన్నాడు. ఆమెలో ఏమైనా లోపముందా అంటే అందం విషయం తీసుకున్నా, ఆకారం విషయం తీసుకున్నా లోపమన్నది లేదు. తానేమైనా ముండలనో ముసుగులనో మరిగాడనటానికి ఆడగాలి సోకితేనే ఆమడ దూరం పారిపోతాడు. కాబట్టి ఆ మనిషిలోనే లోపముందని అంతా అనుకున్నారట.

అంతవరకూ చెప్పి మరో అనుబంధ ప్రశ్నకు సమాధానంగా చివరకు కార్యమయ్యిందనీ, అయి మూడేళ్ళు గడిచినా అమ్మి కడుపు పండింది లేదనీ చెప్పి కథ ముగించేడు.

సాంబమూర్తి చెప్పిన కథకు ముగింపు ఆశించినంత రసవత్తరము కానందుకు నిరాశ చెందిన రసిక బృందం తమ తమ కల్పనా ప్రజ్ఞలను పయోగించి, సరసవలైన భర్తలూ సరసురాండ్రైన భార్యలూ గురించి తృప్తితీరా ఎన్నెన్నో కథలు చెప్పుకున్నారు.

అదే కడసారి. ఆ మర్నాటి నుండి ఆ బృందంతో ఇంకెప్పుడూ పార్క్ ఛాయలకు పోలేదు.

ఆ రాత్రి మాత్రం నాకెంతవరకో నిద్ర సరిగా పట్టలేదు. చాలా సేపటి వరకూ రాజశేఖరం గారి మూర్తీ, మాటలే స్మృతిపథాన మెలగసాగాయి. మా ఇరువురి మధ్యా జరిగిన ఒక చర్చా, ఏనాటిదో ఒక మాటా జ్ఞాపకం వచ్చాయి.

పెండ్లయిన కొత్తలో నేను తరుచు ఆడవాళ్ళ స్వభావం గురించి మాట్లాడుతుండే వాణ్ణి. ఒకనాడాయన – "మీకీ నడుమ ఎప్పుడూ ఆడవాళ్ళ ప్రసంగం తప్ప ఇంకొక దాన్ని గురించి మాటాడ్డం చేతకానట్టుందే!" అన్నారు.

ఆరోజుల్లోనే యింకోనాడు ఒంటరిగా గదిలో కూర్చొని వుండగా నేను వెళ్ళాను. అప్పటికప్పుడే నేను కుటుంబంతో వేరే ఉంటున్నాను. వెళ్ళేసరికి ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టు కనిపించగా ఏమిటి సంగతని ప్రశ్నించాను. ఆయన ఏమీ లేదంటూ లేచి షికారుకి సన్నద్ధులయ్యారు. హోటల్లో కాఫీ

తాగుతుంటే చర్చ ప్రారంభమయ్యింది.

సంస్కారం దేనిపై ఆధారపడి ఉంటుంది? పరిసరాలు, పరిస్థితుల మీదనా? అయితే అవి మారితే అది మారేందుకు అవకాశమున్నదా? లేక సంస్కారం ఆజన్మసిద్ధమా?

ఇంచుమించు ఇటువంటి ధోరణిలో సాగిందా చర్చ. ఆ చర్చ అంత బాగా గుర్తుండి పోవడానికి కారణం – ఆయన దాన్ని పురుషపరంగా కాకుండా స్త్రీ పరంగా సాగిస్తూ రావడం.

నాకానాడే కొన్ని అనుమానాలు కలిగేయి. ఆయన గంభీర స్వభావం యెంత సన్నిహితులకైనా ఆయన కంచుకోటలోకి ప్రవేశం అంగీకరించదు. ఈనాడీ కథంతా విన్నాక ఆనాటి ఆ చర్చ వెనక ఆయన మనస్సు అర్థమైనట్టనిపించింది.

అప్పటి ఆ ఉద్విగ్న స్థితిలో వెంటనే వెళ్లి రాజశేఖరం గారిని చూసి రావాలనిపించింది. కాని సామాన్య సంసారుల ప్రయాణాలకు ఎన్నో ఇబ్బందులు. రెండు మూడు రోజుల తరువాత ఒక ఉత్తరం మాత్రం రాయగలిగేను. అతణ్ణి కలియటమనేది ఆ తరువాత ఒక సంవత్సరం నాడు గాని సాధ్యపడలేదు.

### 3

విశాఖపట్నంలో నాకు పని పడింది. చాలా ఉత్సాహంతో బయలుదేరాను. రాజశేఖరం గారి యింటే మకాం అనుకున్నాను.

ఆయన యిల్లు మారడంచేత జట్కా తిన్నగా ఆఫీసుకు పట్టించవలసి వచ్చింది. నన్ను చూసి చాలా ఆనందంతో ఎదుర్కోలు ఇచ్చారు.

ఆయన నా యోగక్షేమాలు అడుగుతూ నేను వచ్చిన విధం తెలుసు కున్నాక అనుకోని విధంగా కొంత తబ్బిబ్బయ్యారు. తరువాత "సరే మీరు వెళ్ళి సామానులు ఇంటి వద్ద పెట్టించి మళ్ళా ఇక్కడకు రండి. ఇద్దరం ఇక్కడ నుండి కలిసిపోదాం" అన్నారు.

నేనా మాటలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియక తడబడుతూ "అలానే, అలానే" అన్నాను.

ఆయన ఎడ్రసు చెప్పారు. జట్కాలో కూచుంటూ మరి ఒకసారి ఆయన ముఖం చూశాను. ఆయన ఇంకా ఏదో ఆలోచిస్తున్నట్టే తోచింది. పొరపాటు చేస్తున్నానేమో అనుకుంటూనే జట్కావాలాకు ఎడ్రసు చెప్పాను. నాలుగు వీధుల అవతల రాజశేఖరం గారి ఇంటిముందు జట్కా ఆగింది.

అసలు సంగతి అప్పుడు తెలిసింది.

ఇంట్లో ఆయన భార్యా, నాయనమ్మా ఉన్నారు. వాళ్ళు నన్నూ నా సామానులనూ ఎంతసేపయినా వీధిలో వుంచే మాటాడుతూ వచ్చారు. భార్య ఘోషాస్త్రీవలే తలుపు చాటున నిలబడి మాటాడింది. నాయనమ్మ ఎదుటబడి సవాలక్ష ప్రశ్నలు వేసింది. నాయనమ్మ పూర్వకాలపు మనుష్యుల సహజ ఛాదస్తాన్ని ప్రదర్శిస్తే, మనుమరాలు 'మా మగవారు యింట్లో లేరు' అన్నట్టు మాటాడింది.

ఒకటి రెండుసార్లు జట్కాను ఏ సత్రవుకో, రెస్టుహౌస్‌కో పట్టిద్దామా అనుకున్నాను. అంతవరకూ వచ్చేక అది మరీ అసంబద్ధ చర్యగా తోచింది. అందుచేత అలానే అన్ని ప్రశ్నలకూ సంశయాలకూ ఇయ్యవలసిన జవాబులన్నీ యిచ్చి చివరికి వారి ధర్మమా అని సామాను ఇంట్లో పెట్టించగలిగేను.

ఈ దుస్సంఘటన నుండి బయటపడుతూ నాకు నేనుగా వేసుకొన్న మొట్టమొదటి ప్రశ్న – పాపమా మానవుడు వీరితో ఎట్లా వేగుతున్నాడా? అని.

రాజశేఖరం గారిని నేను బాగా ఎరుగుదును. ఆయన స్వభావం యీ తీరు మనుష్యులతో సరిపుచ్చుకోగలిగేది కాదు.

ఆయన భార్యను గూర్చి సాంబమూర్తి చేసిన వర్ణనలలో పెద్ద అతిశయోక్తి గాని, అసత్యంగాని ఏమీలేదు. ఆమె కనుముక్కు తీరూ, అంగ సౌష్టవం విడివిడిగా చూస్తే ఏ దోషమూ ఎన్నలేము. మొత్తం మనిషిని చూస్తేనే ఏమిటోగా ఉంటుంది.

ఆమె కాస్త పొడవుగా ఇంచుమించు ఆయనంత ఎత్తూ ఉంటుంది. మనిషి పలచన. వర్ణం చామనచాయ. నాజూకుగా ఉండే ప్రయత్నం ఉందిగాని ఎలా ఉండాలో తెలియదు. తన ప్రపంచం తనది. అందులోంచి అడుగు బయట పెట్టదు. యింకొకరందులో ప్రవేశించడానికి వల్లకాదు. క్షణంలో కన్నీరు కార్చగలదు. తల్చుకుంటే ఇంటినంతటినీ నిముషంలో నరకంగా మార్చగలదు – అనిపిస్తుందా ముఖ ముద్రతీరు.

అట్టి మనిషితో ఎవరికైనా – ముఖ్యంగా రాజశేఖరంగారికి, వేగడం కష్టం. కాని అతను వేగుతున్నాడు.

అతని దుస్థితి అర్థమయ్యాక అతనిమీద జాలివేసింది.

రాజశేఖరంగారు తమ ఆంతరంగిక దౌర్బల్యాలు స్నేహితుల ముందైనా బయట పడడం సహించలేరు. ఈసారి నేనక్కడ ఉన్న కొద్ది రోజులలో తనంత తానే వ్యక్తం చేసుకోక తప్పని పరిస్థితులేర్పడ్డాయి.

బహుశా నా ఆతిధ్య సత్కారానికే కామోసు నేను వెళ్ళిన మరునాడు ఒక బంగారు గాజు తాకట్టు పెట్టేడు. ఆ విషయం నాకు తెలియదు. ఇంకో యింటనే యిలాటి పని జరిగితే అతిథికి ఆ విషయం తెలియనీయ కుండా బహు గోప్యంగా ఉంచేవారు. కాని యీ యిల్లు వేరు.

మూడవనాడు పగలు పదిగంటలకు మేమిద్దరం

హోటలుకు బయలు దేరనున్నాము. అవి మంచి రేషను రోజులు. అందుచే రాజశేఖరంగారు ఎంత బలవంతం చేసినా, అది సాకుగా, వారింట భోజనం తప్పించు కున్నాను. కాని ఆయన విడువలేదు. బిల్సు ఆయనే చెల్లిస్తూ వచ్చారు. ఆకాడికి – కష్టమో నష్టమో వారింట భోజనం చెయ్యడమే మంచిదేమోనని నేననుకుంటూనే ఉన్నాను. ముసలావిడ ఆ మాట బయటకే అన్నది.

“అది కాదురా. యెలాగూ ఖర్చు తప్పని కాడికి ఆ అబ్బాయిని హోటేళ్ళకు తిప్పడమెందుకూ? ఇక్కడే భోజనం చెయ్యమను” అన్నది – వంటింట్లోంచి దీర్ఘాలు తీస్తూ.

లోనుండి, యీవల గదిలోనున్న నా వద్దకువస్తూ, రాజశేఖరం గారు ద్వారం వద్దే ఉండిపోయారు. అతని ముఖం చూస్తే నాకు కాస్త భయం వేసింది.

ఆయన అక్కడనుండే, ముఖం త్రిప్పకుండానే,వెనుక వంటింట్లో వున్న ముసలామె వంక క్షణకాలం చూశారు. చూసి తరవాత నా ముఖంలోకి చూశారు.

నాకు గల నటనా సామర్థ్యాన్నంతనూ వినియోగించి ఆ ముక్కలు నా చెవిని చేరలేదన్నట్టు నేను నటించబోయాను. బహుశ అది మరింత పొరపాటై వుండవచ్చు. అతని ధర్మమా అని అప్పటికి శాంతించారు.

ఆ విషయం అంతటితో ముగిసి పోతుందనుకున్నాను. కాని ముగియలేదు. సాయంత్రం ఆఫీసు నుండి అలానే కాఫీ హోటలుకు పోయి అక్కడి నుండి అతని బలవంతంపై సినీమాకు పోయాము. తిరిగి వచ్చేటప్పుడు నా భోజనకార్యం ముగించుకొని ఇంటికి వచ్చాము.

అంతకు ముందు ఉమ్మడి ఖర్చుతో నేను అంతో ఇంతో పాల్గొనే అవకాశం వుంటూ వచ్చింది. ముసలమ్మ మతిమాలినతనం వల్ల అవాళ ఆ అవకాశం పూర్తిగా లోపించింది. మనసులో కష్టపడుతూనే అన్నిటా రాజశేఖరం గారి డబ్బే ఖర్చవుతుండగా ఇంటికి వచ్చి హోల్డాలు పరిచి పడుకున్నాను.

రాజశేఖరంగారు లోనికి వెళ్ళి పావుగంట గడిచింది. అయినా ఆయన భోజనానికి పోయి వచ్చిన జాడ కనుపించలేదు. భార్య భోజనానికి లెమ్మని మళ్ళా మళ్ళా అడగడం సన్న సన్నగా వినిపిస్తూనే వుంది. చివరకు లేచినట్టున్నాడు. వంట యింట్లో అలికిడి వినిపిస్తోంది. అమ్మయ్య అనుకున్నాను.

కాని ఆ సంతృప్తి ఎంతోసేపు మిగలలేదు. ఆ అమ్మాయి యేలనో గాని నట్టింట నిద్రపోతున్న ముసలమ్మను లేపి పిలుచుకెళ్లింది. ఆమె విసుక్కుంటూనే లేచి వెళ్ళాక లోపల ఏం జరిగిందో తెలియదు. ఆకస్మికంగా ముసలమ్మ గొంతు అతి స్పష్టంగా వినిపించసాగింది.

“ఇది బాగుందిరా! నేనెంత గ్రుడ్డిముండనైనా నాకా మాత్రం కళ్ళు కనిపించవనుకున్నావా? దుక్కపోతు లాటి గాజు. తులమెత్తు గాజు. చీమా? దోమా? – కనిపించక పోవడానికి. అందుకోసరమని దానిమీద అలక సాగిస్తావా? ఇది మా బాగుంది. ఇంతకూ అది నాతో చెపితే మాత్రం నీకొచ్చిన భయమేముంది? నువ్వేం నా దగ్గర వజవజ వణికి పోతున్నావు గనుకా?” అని ఒక దీర్ఘంతీసి చివరకు – “అయినా కాకపోయినా యీ ముదనష్టపు స్నేహితులు నీకెక్కడ దాపురిస్తారో తెలియదు...” అంటూ ఆమె యింకా యేదో అనే ధోరణిలో వున్నది. ఆకస్మికంగా ఏదో కంచుగ్లాసై ఉంటుంది, పగల వేసినట్టు రంగున మారు మ్రోగింది.

ఆ శబ్దానికి త్రుళ్లిపడి లేచి కూర్చున్నాను. రెండు మూడు నిముషాలు ప్రగాఢమైన నిశ్శబ్దం. ఎట్టి హాహారవాలూ వినిపించలేదు. దానితో నేను భయం తీరి మళ్ళా పడుకున్నాను.

పావుగంట తరువాత రాజశేఖరం గారు బయటకు వచ్చారు. నేను నిద్ర పోతున్నట్టు టక్కు పెట్టేను. అయినా ఆయన విడువలేదు.

తట్టిలేపి “అలా పోయి వద్దాం పదండి” అన్నారు సహజమైన గొంతుకతో. నేను నిద్ర వస్తోందన్నాను. ఆయన వినిపించుకోలేదు. తనే హోల్డాలు చుట్టపెట్టి వరండాలోనే దూలం మీద సర్దిపెట్టారు.

దారి కడాకూ ఆయన గాని నేనుగాని ఏమీ మాటాడలేదు. పూర్ణా థియేటర్ రాగానే అతను అందులోకి దారితీశాడు. ఏం పిక్చరౌతోందో ప్రారంభించి ఎంతసేపయ్యిందో తెలియదు. వున్నంతసేపు వుండి ఆట ముగిశాక తిరిగి వచ్చేశాం. ఆ రాత్రి అతనూ నాతోపాటు వరండాలోనే ఆ చిన్న బెడ్డింగ్ మీదే యిరుక్కున్నాడు.

మరునాడంతా గడచినా అతను ఎప్పటి మనిషి కాలేకపోయారు. మూడవ నాడు సాయంకాలం బీచ్‌నుంచి వస్తూ కాస్త కులాసాగా మాటాడ సాగారు. అప్పటికప్పుడే బాగా చీకటి పడ్డది. వీధులనిండా విద్యుద్దీపాలు కాంతివంతంగా ప్రకాశిస్తున్నాయి. రోడ్డుపై సాయంసంధ్యా జనసాంద్రత ఇంకా తగ్గలేదు. మేము మందగమనంతో మెయిన్ రోడ్డున ఆ జన ప్రవాహాన్ని మెల్లమెల్లగా తప్పించుకుంటూ జంటగా వస్తున్నాం. అదను చూచి జరిగిన దానికి నా సానుతాపాన్ని వ్యక్తం చేసే ప్రయత్నంలో అన్నాను – “నేను మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను, అన్నివిధాలా”.

చివరి పదం ఒత్తి పలకటం ఆయన గుర్తించేరు.

"అంటే?" అన్నారు గ్రహించే.

నేను నీళ్ళు నమిలాను. కొంతసేపు పోయాక, జరిగిన దానినంతా ఒక పక్కకు నెట్టేయండి అన్నట్టు –

"అదేం లేదులెండి. ఈమధ్య మాయింట్లో యిలాంటివి చాలా సామాన్యమై పోయాయి!" అన్నారు.

నేనేమీ మాటాడలేదు. మరికాస్తసేపు పోయాక ఆయనే అన్నారు.

"ఎందుచేతో తెలీదు కాని కొన్నాళ్ళయి ప్రతీ చిన్న విషయానికీ నేను ఓరిమి పోగొట్టుకుంటున్నాను. నిగ్రహించుకోవాలన్న కోరికున్నా కోపాన్ని ప్రదర్శించాలన్న లాలసతే గట్టిగా పనిచేస్తోంది" అంటూ అర్థోక్తిలో ఆగినట్టు ఆగిపోయారు.

ఆయన ధోరణి మారినట్టు కనిపెట్టి నేనింకేమీ మాటాడలేదు. కొంతసేపు గడిచాక ఆయనే అన్నారు.

"అందరు ఆడవాళ్ళూ అంతేనో, లేక మా ముసలమ్మ ప్రత్యేకంగా అట్టిదో తెలియదు. అంత వయసు వచ్చేక కూడా తనకు కావలసిన విషయమేదో, అక్కర లేనిదేదో తెలిసికోదు" అంటూ నాకొక అవకాశ మిచ్చేరు.

నాలో తెలిసిన మేరకు స్త్రీజన చిత్తవృత్తిని ఉదహరిస్తూ 'అది అంతే, బాధ పడకండి' అంటూ అతన్ని శాంతింపజేశాను.

మరునాటికి నే వచ్చిన పని ఆశించిన విధంగా పూర్తయ్యింది. ఆ రాత్రికే ప్రయాణం పెట్టుకున్నాను.

ఆ సాయంకాలం బీచ్‌లో–

"మళ్ళా ఎప్పుడు వస్తారు?" అన్నారు రాజశేఖరం.

నా కోసం ఆయన అలా అప్పులు చేసి ఖర్చుపెడితే యింకోసారి వచ్చినప్పుడు ఆయనతో గడపలేనన్నాను. ఆయన నవ్వేసి యిదే మూల అంటూ, ఆయన ఆదాయ వ్యయాలతో ఆరంభించి ఆర్థికస్థితిని వివరించారు.

వెనుక ఆసరాలేని మధ్యతరగతి కుటుంబీకులందరి వలెనే ఆయనా తలకు మించిన అప్పులు చేయక తప్పలేదు. అయితే ఆ అప్పులెలా తీరతాయన్న ప్రశ్నకు ఆయన యిచ్చిన సమాధానం నన్ను ఆలోచనలో పడవేసింది. నిండా మునగదలచిన వానికి సముద్రం మోకాలి బంటి అనే వైఖరి ఆరోగ్యవంతమైన ధోరణి కాదు.

ఇంటికి వెళ్ళాక వారం రోజులాలోంచి రెండు తావుల ఉత్తరం రాశాను. అందులో అతనప్పుడు పెంచి పోషించుకుంటున్న భావాలు, అందువల్ల ఆయన జీవన వైఖరిలో వస్తున్న మార్పులు ఎంతటి ప్రమాదకర మైనవో చెప్పేను. ఋణ శేషం ఎట్టిదో వివరించి మానవ ప్రయత్నానికి అసాధ్యము లేదంటూ అప్పుల్లోంచి బయట పడటానికి నాకు తోచిన సూచనలిచ్చాను.

ఆ ఉత్తరానికి జవాబొస్తుందని చాలా కాలం ఎదురుచూశాను. అది ఆయన కందిందో లేదో కూడా తెలియదు.

## 4

తరువాత మూడేండ్లదాకా – అంటే ఏడాది క్రితం ఆయనను చూడబోయే వరకూ, ఆయన సమాచారమేమీ తెలియలేదు.

మధ్యలో ఆకస్మికంగా ఒకసారొచ్చి తిరుగు ట్రైనులో ఇంటికి వెళ్ళి పోయేరు.

ఆ ముందు రోజునే ఆయన నుండి నాకొక ఉత్తరం వచ్చింది. అందులో, ఎట్టి కారణాన్నీ పేర్కొనకుండా, వీలైతే ఒక వంద రూపాయలు పంపమనీ అవకాశం లేకపోతే విచారించవద్దనీ వ్రాసి ఉంది. నేనొక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా అర్జెంట్ టి.ఎం.ఓ. చేశాను.

ఆ సాయంకాలం మెయిల్‌లోనే అతను వచ్చేరు. ముఖంలో పిచ్చి కళలు కానవచ్చాయి. రెండు మూడు గంటలున్నారు. భోజనం చేశారు. ఆ రాత్రే వెళ్ళిపోవాలన్నారు. నేనాయనను స్టేషనుకు దిగబెట్టే ముందు మనియార్డరు అందిందా అన్నాను. అందిందన్నారు. సరిపోదా అన్నాను. సరిపోతుందన్నారు. ఏమిటి విశేషమన్నాను. ఏమీ లేదన్నారు. ఆ పూట విశ్రాంతి తీసుకొని పోరాదా అన్నాను. ఇంట చాలామంది చుట్టాలున్నారట. అయితే మరెలా ఇలా వచ్చారూ? ఈ ప్రశ్నకు చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుని – ఊరికినే అన్నారు.

నేను జేబులోంచి ఐదు పదిరూపాయి నోట్లుతీసి ఆయన జేబులో వుంచబోయాను. ఆయన నా ముఖంలోకి సూటిగా చూస్తూ ఒక విషణ్ణ హాసం చేసి ఆ డబ్బునాకు వాపసు యివ్వబోయారు.

నేను పుచ్చుకోలేదు. అవసరం లేకపోతే తరవాత తిరిగి పంపిం చేయండంటూ ఆ నోట్లు ఆయన జేబులోనే కుక్కాను.

అప్పుడాయన చూసిన చూపూ, ఆ ముఖంలో వ్యక్తం అయిన భావాలూ నా జన్మలో మరచిపోలేను. ముఖ కండరాలన్నీ కంపింపగా వానిని నిగ్రహించుకోడానికి విఫల ప్రయత్నం చేయడం నా ఎరికలో యిది రెండవసారి. ఒక స్థితికి వచ్చేక ఆయన ముఖం తిప్పేసుకున్నారు.

దారిలో చెప్పారు. వాళ్ళ ముసలమ్మ పోయిందట. తనకు కర్మకాండల మీద నమ్మకంపోయినా బంధువులకుంది.

మరణశయ్య మీద ముసలమ్మ కన్నీళ్ళతో ఆయనకు చేసిన తుది వేడుకోలు – తనకు కర్మ జరిపించమని.

అన్న గురించి ఏదో చెప్పబోయి అంతలో విరమించుకున్నారు. ఏమని నేనడగలేదు.

నాకా మనిషి కృతజ్ఞత చూపించిన విధం చూస్తే జాలీ, అందులో వ్యక్తమైన నాతోడి ఆయన స్నేహం తలచుకొంటే మహదానందం కలిగాయి. ఆ మిగిలిన రాత్రి ఆయన తలపుల్లోనే గడిచిపోయాయి.

ఆ తరవాత మరి ఉత్తరాలు లేవు. ఏడాది క్రితం తమ్ముడి పెండ్లికి ఏలూరు పోయివస్తూ దారేకదా అని విశాఖపట్నంలో దిగేను. ముందుగా ఉత్తరం వ్రాసి ఉన్నానేమో ఆయన స్టేషనుకు వచ్చేరు. ఎదురుగా వచ్చినా ఆయన పలకరించే వరకూ ఆయనే రాజశేఖరం గారని నేను పోల్చుకోలేక పోయేను.

ట్రైను వాల్తేరు ప్లాట్‌ఫారమ్ మీద ఆగేసరికి ఉదయం 8 గంటలు అవుతుంది. చేత హోల్డాల్‌తో తెగమాసి ఉన్న బట్టలతో రాత్రల్లా నిద్రలేక నలిగిన శరీరంతో బయటపడి చుట్టూ ఉన్న జనంలో రాజశేఖరం గారిని వెతకసాగాను. ఆయన ఎక్కడా కనిపించలేదు. బహుశా రాలేకపోయి ఉంటారు – అనుకుంటూ కూలీ కోసం దిక్కులు చూస్తున్నాను.

ఒకాయన పెదవులపై చిరునవ్వుతో చెయ్యెత్తి నవీన పద్ధతిలో విష్ చేస్తూ అల్లంత దూరాన కనిపించారు. ఆయన రాజశేఖరంలా కనిపించినా రాజశేఖరం గారు కాదు. ఎవరా అని ఆలోచిస్తుంటే దగ్గరకొచ్చి 'హలో!' అన్నారు. ఆ గొంతు రాజశేఖరం గారిదే.

మనిషి పూర్తిగా మారిపోయారు. ముఖంలో ద్విగుణీకృతమైన గాంభీర్యం. నడకలో, దుస్తుల్లో, నిలబడే తీరులో అన్నిటా మార్పే. మెరసే ఖరీదైన బూటు, మడతలు చెదరని విలువైన దుస్తులు, మీసకట్టుతో సహా పరిశుభ్రంగా గీయపడ్డ పచ్చని గెడ్డం, కొంచెం గందరించి రంగుతేలిన ముఖం, కొత్తగా పెట్టించిన క్రాపు – అన్నీ కొత్తవే.

స్టేషన్ నుంచి వెలుపలికి వస్తూ జేబులోంచి సిగరెట్ కేస్ తీసి, అలవాటు చొప్పున కాబోలు ఒకసారి నా వంక చూపించి, నేను కాల్చనని జ్ఞాపకం వచ్చిందేమో వెనుకకి తీసేసుకున్నారు. చివకు యీ అలవాటు కూడా క్రొత్తదే.

ఊరునుండి ఊరికి రావడం వల్ల క్రొత్తచోటూ క్రొత్త వాతావరణం కలిగించే విభ్రాంతికి రాజశేఖరం గారి క్రొత్తదనం కలిగించేది మరింత తోడుకాగా జట్కాలో వారింటికి చేరుకున్నాము.

మనిషిలోనే కాక వారి యింటిలో కూడా చాలా మార్పులు వచ్చాయి. పెద్ద గదిలో అన్నీ ఆయన దుస్తులూ, ఆయన జోళ్ళూ, ఆయన మంచమే తప్ప ఆడవాళ్ళ చీరలూ, మాసిపోయిన చేటలూ, కట్లూడుతున్న జల్లెళ్ళూ కనుపించవు. అలమారులో ఉండే డబ్బాలూ, డొక్కులూ, సీసాలూ పోయి కొత్తగా వచ్చినట్టు కనిపించే పుస్తకాలున్నాయి.

లోపలికొచ్చాక వెనకవైపు తలుపులు చేరవేసి నాకై మడత కుర్చీ వాల్చారు. రాజశేఖరంగారు తమ మంచం మీద కూర్చున్నారు. అంతే ఇద్దరం మాటాడలేదు.

ఆ ఉదయపు తొలి మలిజాముల సంధ్యలో కూడా ఎలా ఏర్పడిందో ఆ గదిలో ఒక స్తబ్ధత్వం ఏర్పడింది. నేను కళ్ళు మూసుకొని బడలికగా వెనక్కి చేరబడ్డాను. నా మనోనేత్రాల ముందు యీ మూడు, నాలుగు దినములలోనే గడిచినవి ఏవేవో ఊళ్ళు, ఎన్నెన్నో వీధులు, ఎందరెందరో మనుష్యులు, నవ్వులు, మాటలు, పరుగులు, గాడిపొయ్యలు, భోజనం పంక్తులు, అప్పగింతలు, ప్రయాణాలు, కునికిపాట్లు, కుదుపులు ఎప్పుడు పట్టిందో చిన్న మాగన్ను పట్టింది.

★ ★ ★

రాజశేఖరంగారు జబ్బపట్టి కుదుపుతుంటే నేను లేచి కూచున్నాను. ఓ కప్పు కాఫీ నాచేతికిచ్చి, క్రింద ఉంచిన కాఫీ కప్పు తీసుకొని మంచం మీదకి వెళ్ళిపోయారు. నే కాఫీ తాగి కప్పు క్రింద పెడుతుంటే –

"నిద్రపోతారా?" అన్నారు.

నేను బద్ధకంగా ఆవులించి అక్కరలేదన్నాను. స్నానం సంగతి అడిగితే యింకాస్సేపు ఆగుతానన్నాను. ఆయన కప్పు క్రింద పెట్టేసి సిగరెట్ వెలిగించారు.

గడచింది ఒకటిరెండు గంటలే అయినా నా ఏలూరు ప్రయాణం ఇక్కడకు రావడం – అన్నీ నిన్ననో, మొన్ననో జరిగినట్టున్నాయి. జట్కాలో వస్తూ మేం అనుకున్న మాటలు గుర్తొచ్చాయి.

"చుట్టాలెవైనా బయటికి వెళ్లారా?" అన్నాను రాజశేఖరం గారి వంక చూస్తూ. ఆయన ఏదో పరధ్యానంలో ఉన్నట్టున్నారు. కొంతసేపటికి నా ప్రశ్న స్ఫురణకు రాగా 'లేదు' అని మరి కాస్తసేపు పోయాక–

"బహుశ ఆయన బజారుకు వెళ్ళి ఉంటారు" అన్నారు కొత్త ధోరణిలో. ధోరణి మాటకు సంబంధించింది కాదు. ముఖ కవళికకు మాటల మధ్య ఎడానికి.

"ఏల వచ్చినట్టు?"

దీనికి కూడా కొంతసేపు ఆగి జవాబిచ్చారు.

"తెలియదు... అనటం – వాళ్ళ అమ్మాయిని తమతో తీసుకెళ్తామని... ఇవాళ ఉదయమే నేను మీ దగ్గరకు

బయలుదేరుతుంటే చెప్పారు".

విషయం మూడు ఖండాలుగా చెప్పేరు. ఆ చెప్పే ధోరణి కొత్త మార్పుల్లో ఒకటిగా కనిపిస్తున్నా అది కాదేమో అనిపించింది. వెనక ఏదో చాలా కథ ఉందేమో అనిపించింది.

అప్పటికింకా ఇదమిద్దమని తేలలేదు. నా ముఖంలోకి చూడకుండా ఎటో చూస్తున్న చూపులూ, మనసులో భావాలు ముఖంమీద కనిపించ కుండా ఆయన చేస్తున్న యితర ప్రయత్నాలూ, చూడగా నా అనుమానం మరింత బలపడింది.

"ఇప్పుడేం పండగలు లేవే - వాళ్ళింట శుభకార్యమేదైనా ఉందా?"

ఆయన నవ్వేరు. ఏదో అనబోయి మానివేశారు.

"అంటే ఎప్పట్లో తిరిగి రావచ్చు?"

ఆయన వెంటనే జవాబివ్వలేదు. గొంతు, మాట స్వాధీనంలో ఉంటాయని రూఢి చేసుకున్నాక అన్నారు.

"తెలియదు. బహుశా నెలలు పట్టవచ్చు. సంవత్సరాలు పట్టినా పట్టవచ్చు" అని వెలుగులేని ఒక చిరునవ్వును సాధిస్తూ-

"అదంతా అక్కడ శిఖరాగ్ర సమావేశంలో హైకమాండ్ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. ఇది ఒక రకమైన తక్షణ ప్రతీకార చర్య - అనుకుంటాను".

ఆ వాక్యాలు వింటూ నేనలాగే ఉండిపోయాను. నా గుండెలో ఏదో చెప్పరాని అలజడి. నిద్రమత్తూ, బద్ధకం అన్నీ ఎగిరిపోయాయి. ఆయన మాటల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆయన మాటాడడు.

పావుగంట గడిచింది. పెరట్లో ఆడవాళ్ళ గిన్నెల చప్పుళ్ళూ, వీధిలో బళ్ళ రాకపోకల చప్పుళ్ళూ, ఎక్కడో మనుష్యులు మాట్లాడుతున్న సవ్వళ్ళూ, సమీపంలో పిట్టల కూతలూ తప్పితే గదిలో నిశ్శబ్దం.

ఆయన అకస్మాత్తుగా లేచి అలమార్లోంచి కాగితం కలం తీసుకొని తొందరగా ఏదో రాస్తూ రాత ముగిసే ముందు అన్నారు.

"అలా బయటకు వెళ్ళాలి. మీరు వస్తారో రారో ఖచ్చితంగా తెలియక శలవు చీటీ పంపించలేదు. టైమ్ ఐపోతోంది. మీరు, కూడా వస్తారా?"

నేను నసుగుతూ నా అవతారం వంక చూసుకుంటున్నాను.

"మీరుండండి. నేనిప్పుడే ఐదు పది నిముషాల్లో వస్తాను" అంటూ నా జవాబు కోసం ఎదురు చూడకుండా చెప్పులు తొడిగేసుక వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిపోయాక ఏం జరిగి ఉంటుంది? ఏం జరగబోతోందీ ఏదేనా జరిగేలోగా యిక్కణ్ణుండి వెళ్ళిపోవడం ఎలాగా? అని ఆలోచిస్తుండగా బయటనుండి ఒక ముసలాయన చేతిలో ఒక పెద్ద సంచీతో తిరిగి వచ్చారు.

ఆయనకు చూపు కొంచెం మాంద్యంలా ఉంది. లేక ఎండ పొడ ఫలితమో మొదట నన్ను రాజశేఖరం అనుకొని ఉంటారు. వెళ్ళబోతుంటే కొత్తవాడిలా కనిపించి ఉంటాను. కాస్త ఒక అడుగు వెనక్కి వేసి నా ముఖం వంక పరకాయించి చూస్తూ-

"ఎవరు బాబూ?" అన్నారు.

నేను లేవబోతూ రాజశేఖరం గారి స్నేహితుడినన్నాను.

"కూర్చో కూర్చో, కూర్చో నాయనా" అంటూ లోనికి వెళ్ళిపోయారు.

ఆయన లక్షణాలు కాస్త అసామాన్యమైనవి. సన్నగా, పొడుగ్గా ఆరడుగుల పొడవుంటారు. పండిన బట్టతలపై స్వచ్ఛ ధవళమైన పలుచని శిఖ ఉన్నది. కాయ శరీరం - ఎన్నేండ్లో చెప్పలేం. అరవైకి తక్కువ కాదన్నది రూఢి.

ఆయన లోనికి వెళ్ళి నాలుగైదు నిముషాల్లో తిరిగి వచ్చారు. తొడుక్కొని ఉన్న లాల్చీ విడిచేశారు. ఒక తడి అంగవస్త్రంతో ముఖం, గుండెలూ, చేతులూ, కాళ్ళూ తుడుచుకుంటూ వచ్చేరు. నేను మర్యాదగా లేచి కుర్చీ వారికిచ్చి మంచం మీద కూర్చున్నాను. ఆయన కూడా కొంతసేపు మర్యాద అప్పగించినా చివరకు కుర్చీని అంగీకరించి దాన్ని వీధి ద్వారం దగ్గరకు యీడ్చుకొని కూర్చున్నారు.

ఆ తరువాత నెమ్మదిగా బాతాఖానీకి దిగేరు.

మొదటల్లా నా పేరూ, ఉద్యోగం, కులగోత్రాలూ, తల్లిదండ్రులూ, వివాహం, మా ఆవిడ పుట్టుపూర్వోత్తరాలూ, సంతానం, రాబడి, ఖర్చు వెచ్చాలూ మొదలైన అన్ని విషయాల మీదా ప్రశ్నించి తెలుసుకొని నన్నేమని అంచనా వేశారో - కొంతసేపు మౌనం తరువాత నెమ్మదిగా అడిగారు -

"అయితే బాబూ, మీరు వచ్చేసరికే బయటకు వెళ్ళిపోయాడా?"

నేను చెప్పాను.

వెంటనే ఆయన చాలా ఆశ్చర్యపోతూ-

"ఏమిటీ? మీరు యీ ఊళ్ళో ఉండటం లేదూ?" అన్నారు.

జరిగిన పొరపాటేమంటే - నేనే డిపార్టుమెంటులో పని చేస్తున్నానో చెప్పాను. కాని ఏ ఊళ్ళో పనిచేస్తున్నానో చెప్పలేదు - ఆ విషయం ఆయన ప్రశ్నల్లో కాని నా జవాబుల్లో కాని రాలేదు. ఇప్పుడా పొరపాటు సర్దుకొని వున్న విషయం చెప్పగా-

"అలానా–" అంటూ ఆ దీర్ఘంలో ఏదో ఓ సత్యాన్ని తెలుసుకున్నట్లు తల తాటించి – చేయి తిరిగిన కళాకారుడిలా ధోరణి మార్చి చెప్పనారంభించారు.

"అలా చెప్పు! అందుచేత నీకూ ఏమీ తెలిసి ఉండదు. నేను అనుకుంటూనే వున్నాను. ఇంత బుద్ధిమంతుడైన స్నేహితుడంటూ ఒకడున్నాక ఇతడైనా ఏల చీవాట్లు వేసి ఉండడా – అని. కాని అదీ సంగతి! నీకు కూడా తెలిసి ఉండదు!" అంటూ క్షణమాగి, ఒకసారి వీధిలోకి చూసి, చప్పన గొంతు తగ్గిస్తూ–

"విన్నావా బాబూ! పిల్లదాని వంటిమీద బంగారం అంతా అమ్మేశాడు. నాలుగు తులాల గొలుసు, రెండు తులాల పుస్తెలనాను, తులంన్నర ఎత్తు గాజుల జత, సమస్తం అమ్మేశాడు. ముక్కుపీ, చెవిపీ మాత్రం యింకా ముట్టుకోలేదు. మంగళసూత్రం జోలికి పోలేదు. సర్వం గుటకాయి స్వాహా.

ఏం చేశాడో తెలియదు – ముండలకే పెట్టాడో, ముఠాకోర్లకే తగలేశాడో తెలియదు. అడిగితే మాటాడడు" అని మరి ఒకసారి వీధివంక చూసి–

"రోజూ అర్ధరాత్రికో, అపర రాత్రికో గాని యింటికి రాడు. అడ్డమయిన స్నేహితులనీ చేర్చి డబ్బు తగలేస్తుంటాడట. ఎక్కడలేని పుస్తకాలూ బోలెడంత వెలపెట్టి కొంటాడట. రాత్రింబగళ్ళు చదువుతాడట. చదివి వీళ్ళకీ వాళ్ళకీ పంచి పెట్టేస్తాడట. పిల్లతో కులాసాగా ఒక్కనాడు ఒక్క మాటన్నది గాని, ఒక్క మంచన్నది గాని ఉండదట. ఎంతసేపూ ఆఫీసూ, ఆవీధీ, యీ వీధీ, స్నేహితులు, వాళ్ళతో అర్ధరాత్రి వరకూ వీధుల వెంబడి తిరగటం! ఇదీ వరస"

అని ఆగి, ఆశ్చర్యం వ్యక్తం చేసే నా ముఖంలోకి చూస్తూ వచ్చిన ధైర్యంతో గొంతు కాస్త హెచ్చించి–

"ఆమధ్య పిల్ల నెల తప్పింది. ఆ విషయం మాకెవ్వరికీ వ్రాయలేదు. తొలిచూలు బిడ్డకు వెనుక ఆసరా లేదు. ఒక్కర్తినీ దానిపాట్లు దాన్నే పడమంటాడా? హాస్పటల్లో పురుడా! ఒక అచ్చటా ఒక ముచ్చటా ఏమీ వల్ల కాదా? పదకొండో నాటినుంచే పనా?" అంటూ ఆగి ఆ విరామంలో పొంగి వచ్చిన ఆకస్మికోద్వేగంతో, "పిల్ల నెల తప్పితే కనుక్కున్న తల్లి దండ్రులకొక్క ముక్క వ్రాయవద్దూ? పోనీ పురుడు వచ్చాకైనా? అందులోనూ మగపిల్లడే – ఒక్క కార్డుముక్క రాస్తే నీ సొమ్మేం పోయింది? చిన్నప్పణ్ణుంచీ పెంచామే. వృద్ధిలోకి తీసుకొచ్చి పిల్లనిచ్చామే. మేమేం విషమూ, ముషిడీ పెట్టామని మాతో కత్తి గడతావూ? నిజమే, కోపం వచ్చి కొన్నాళ్ళు నీతో నేను మాటలు మానేసింది నిజమే. తక్కిన వాళ్ళంతా నీతో మాటాడుతూనే ఉన్నారే. అడుగులకు మడుగులొత్తుతూనే ఉన్నారే. నువ్వు వాళ్ళతో మాత్రం ఏం సరీగ్గా ఉన్నావూ. ఈవూరి కాపూరెంతో ఆ వూరికీవూరూ అంతే అన్నారు వాళ్ళు. అయితే కష్టసుఖాల్లో ఉత్తరాలు రాసుకోరూ? మా గ్రహచారాలు బాగులేక మా యింట్లో మేమేవో బాధలు పడుతూ పిల్ల క్షేమసమాచారాలు కూడా మేం తెలుసుకొనే ప్రయత్నం చెయ్యలేక పొయ్యాం, అయితే అందుకని తొలి చూలు చూలింతని పురిటి సమయంలో కనుక్కున్న తల్లికి దూరం చేస్తావా? నువ్వు మనిషివా, కటిక కసాయి వాడివా? పిల్లది బాగోదు నామాట వినండని చిలక్కి చెప్పినట్టు చెపితే వల్లకాదని, ఉత్తరం రాస్తే అక్కడితో తెగతెంపులని అదిరించి బెదిరించి ఆంక్షలు పెడతావా! నువ్వు మనిషివేనా? అంట?"

అలా అని నా ముఖంలోకి చూస్తూ ఆగిపోయారు. ఆయన చెప్పింది వింటే పట్టరాని ఆశ్చర్యం కలిగింది. అందులో నిజమెంత? కట్టు కథ ఎంత? అన్న అనుమానాలేశాయి.

ఆయన మరి ఒకసారి ద్వారం వంకచూసి–

"పోనీ యేం నిర్వాహకుడవని తలకు మించిన భారాలు నెత్తినేసుక తిరుగుతావ్. ఉన్నది లింగూ లిటుకూ ఇద్దరు. పొదుపుగా వాడుకుంటే జీతం సరిపోదూ? ఉహూ షోకులెక్కువ, దర్జాలెక్కువ, పంతాలు పట్టలేం. తేవడం చేతకాదు. బంగారమ్మి నాయనమ్మ సంవత్సరీకాలకు డబ్బు పంపిస్తావ్. ఏం, ఆవిడ నీకే నాయనమ్మా– వాడికి కాదా? బంగారమ్మి స్పెషల్ రూమ్‌లో పెళ్ళానికి పురుడు పోయిస్తావ్. తల్లీ తోడూ బతికిలేరా, – ఆ బాధ్యత నీకేలా? బంగారమ్మి టీక్‌టాక్‌గా బూట్లేసుకు తిరుగుతావ్. కత్తిరమార్కు సిగరేట్లు కాలుస్తావు. నీతోటి వాళ్ళంతా నీలాగే ఉన్నారా! అదేమని పిల్లది అడగడానికి వల్లకాదు. నేనడగవస్తే మొండి జవాబులిస్తావ్. ఇదేనా పెద్దమనిషి తరహా?" అని సవాలు చేసినట్టు ప్రశ్నించి ఆగి యింకా పొంగివస్తున్న కోపంతో.

"నేనెవర్నీ – నీకు తెలుసా? .... కాదు నిన్నే అడుగుతున్నాను" అంటూ కుడిచేతి చూపుడు వేలుతో నన్ను టొకాయిస్తూ, నా చేత తెలియదనిపించుకొని "మేనమామను! పిల్లనిచ్చుకున్న మేనమామను!! మీ అమ్మా నాయనా నువ్వు ఎనిమిదేళ్ళ కుర్రకుంకగా ఉన్నప్పుడే పోతే – నిన్నూ నీ అన్నలనూ, కొడుకు చచ్చి ఏడుస్తున్న మీ నాయనమ్మనూ చిప్ప చేతబట్టుకొని పంచలపాలు కాకుండా అడ్డుపడ్డ వాణ్ణి. నువ్వు కూడా మీ అన్నలాగే తెత్తెత్తె పప్పప్ప అనుకుంటూ గొడ్లతో పాటు గొడ్డు బతుకు బతక్కుండా పై చదువులక్కూడా పంపించి నీకోదారి చూపించిన వాణ్ణి. అలాంటి నాకు నువ్వు చూపించే కృతజ్ఞత ఇదా? నా బిడ్డ ఉసురేకాక నా

ఉసురుకూడా కట్టుకుంటావా? ఛీ! నీదీ ఒక బ్రతుకేనా?" అంటూ మొహం ఛట్‌న అటు తిప్పేసుకున్నారు. తరవాత ఆయాసపడిపోతూ మడత కుర్చీలో చారబడి పోయారు.

ఇంతసేపూ నేను హృదయోద్వేగంతో సతమతమౌతూ వచ్చాను. ముసలాయన యొక్క ఆవేశం, ఆవేదనా కలిగించే కల్లోలం ఒక ప్రక్క. ఏ క్షణాన రాజశేఖరం వస్తారో తెలియదు. ఆయన ఎంతోదూరం వెళ్ళి ఉండరు. ముసలాయన చూడబోతే ఒళ్ళుపయి తెలియకుండా ఉన్నారు. ఇల్లే క్షణాన రణరంగంగా మారుతుందో అని గుండెలు అరచేత పట్టుకొని ఉన్నాను.

కొంతసేపు పోయాక ముసలాయన మళ్ళీ ఆరంభించ బోయారు.

"సరే–" అన్నారు.

కాని ఆ తరవాత మాట పూర్తికాలేదు. ఆయన భార్య కాబోలు ఒక స్థూలకాయ ఎప్పుడక్కడకు వచ్చారో తెలియదు. భర్తను ఉచ్చస్వరంతో మందలిస్తూ అన్నది.

"ఎందుకలా హైరానా పడిపోతారూ? ఇప్పుడా సోదంతా ఎందుకు? అయిపోయిందేదో అయిపోయే. ఎంత గింజుకున్నా జరిగిన దానిని మార్చలేరు". అన్నది దీర్ఘాలు తీస్తూ.

ముసలాయన అంత ఆవేశంతో ఆరంభించబోయిన వాడూ ఆమె గొంతులో, ఆమె ముఖంలో ఏం విన్నాడో, ఏం కన్నాడో మంత్రముగ్ధుడైన వృద్ధనాగమయ్యలా మడతకుర్చీలో వెనక్కి చారబడి పోయాడు. దేనికైనా ఒక ముగింపు ఉండాలి కాబట్టి శాంత గంభీర స్వరంతో చెప్పసాగాడు.

''అహ! అదికాదు. కుర్రవాడు చిన్నవాడైనా బుద్ధిమంతుళ్ళానూ మంచి వాడులానూ కనిపిస్తే చెపుతున్నాను. విషయం తెలిస్తే ఆ సమయం వచ్చినప్పుడు అతడైనా మంచి దారికి మళ్ళించగలుగుతాడేమో అని చెపుతున్నాను" అంటూ తన ధోరణి ఉపసంహరిం చేసుకున్నాడు.

కాని ఆ యిల్లాలు భర్తను మందలిస్తూనే తన ఉపన్యాసం తాను ఆరంభించింది. ఆమె మాటాడేటప్పుడు ఆవేశపడదు. చల్లగా మాటాడుతూనే పెట్టాలనుకున్న వాళ్ళకు పెడుతుంది. తన విషయం వచ్చేసరికి తెలుపు నలుపూ, నలుపు తెలుపూ చేసి చూపించగలదు.

ఆమె రాజశేఖరంగారి మూడు పురుషాంతరాలను యెత్తిచూపి, రెండు తరాలుగా తమ వాళ్ళు వాళ్ళతో పడ్డ కష్టాలు వర్ణించి, ఆడదాని సలహా పాటించని కుటుంబాల పని అధోగతే అని నిర్ధారించి చివరికిలా ముగించారు.

"... ఇంతకూ చెప్పవచ్చేదేమంటే మా ఆడబిడ్డ మగుడు పట్టుమని పదెకరాల పొలం లేకపోయినా పదూళ్ళ మొఖాసా దారుల్తోపాటు నాను కో ఆపరేషన్లో జైలుకెళ్ళేడు. వెళ్ళి తానూ వాళ్ళతో సమానమనుకున్నాడు. మహ మహవాళ్ళు కాయితాలు రాసిచ్చి బయటపడ్డారు. కాని, కాళ్ళూ చేతులూ పట్టుకొని ఎందరం బతిమాలినా యీయన మాత్రం శశా... వల్ల కాదన్నాడు. అంత మొండి పట్టుదల. ఆ తరానికాయన, ఆయన కొడుకు యీయన .... అయ్య పోలికలు ఎక్కడకు... ఎక్కడకు..." అంటూ ఆగిపోయింది.

నే తలతిప్పి చూసేసరికి ఆయన గుమ్మం దగ్గర జోళ్ళు విడుస్తున్నారు. అక్కడేమీ జరగనట్టే అత్తామామా ఆ గదిలోంచి వెళ్ళిపోయారు. తానేమీ విననట్టే రాజశేఖరంగారు "స్నానానికి లెండి" అంటూ నూతికి బయలు దేరదీశారు.

★ ★ ★

ఒంటి గంటకు పడి నిద్రపోతే రాత్రి బాగా చీకటిపడ్డాక గాని లేవలేక పోయాను. తెలివి వచ్చి కన్నులు విప్పేసరికి నాకు మొట్టమొదట కానవచ్చిన దృశ్యం – సాంద్రమైన చీకట్లలో ఒక నిప్పుకణం వృత్త పాదవర్తుల గతిలో కదిలి ఒకచోట నిలచి కణకణమని వెలగడం.

అప్పటికప్పుడే పాత జ్ఞాపకాలతో గుండెలు బరువెక్కుతున్నాయి. చీకట్లో ఒంటరిగా సిగరెట్లు కాలుస్తూ రాజశేఖరం. వాళ్ళు మధ్యాహ్నం రైల్లో ఊరుకెళ్ళి ఉంటారు. అప్పట్నుండీ యిప్పటివరకూ ఆయన ఏమేం ఊహలకు పోతున్నాడో.

అకస్మాత్తుగా అక్కడ నుండి పారిపోవాలనిపించింది. ఆ వెంటనే అది న్యాయం కాదనిపించింది. ఒక నిర్ణయానికి వచ్చేక పక్కకు వత్తిగిలి.

"టైమెంతవుతుందంటారు?" అన్నాను రాజశేఖరంగారిని ఉద్దేశించి.

ఆయన లైటు వేశారు: నేను కూర్చున్నాను.

"తొమ్మిదిన్నర" అన్నారు వాచీ చూసి.

"నేను పదకొండు గంటల ట్రైనులో వెళ్ళాలే" అన్నాను.

ఆయన ప్రతిఘటించలేదు.

"తప్పదంటారా?" అన్నారు.

నాకేం చెప్పడానికి పాలు పోలేదు.

''సరే'' అంటూ లేచారు. ముఖం కడుక్కోడానికి నీళ్ళిచ్చారు. ఇల్లు తాళం పెట్టి భోజనానికి వెళ్ళేము. దారిలో ఒక్కమాటైనా ఆయన నోటి వెంట రాలేదు. వేళ కానివేళ నిద్దర లేచానేమో చలివేస్తున్నట్టూ, ఉష్ణం వచ్చినట్టూ వుంది.

భోజనాలు చేసి యింటికి వచ్చి దారిలోనే రిక్షా బేరమాడి హోల్డాలు వేసుకొని స్టేషనుకెళ్ళాము. కంపార్టుమెంట్లో

బెడ్డింగ్ పెట్టాక క్రిందకి దిగేము.

ఆయన నా కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ ఒక సుదీర్ఘమైన నిశ్వాసం విడిచి నవ్వటానికి ప్రయత్నించి అన్నారు.

"మనం విడిపోయాక బహుశ రెండుసార్లు కాబోలు మా యింటికి వచ్చారు. ఈ రెండవసారి కూడా చాలా చేదు అనుభవం తీసుకు వెళ్తు న్నారు. అదృష్టవంతులు. మళ్ళా యెప్పుడు వస్తారూ?" అన్నారు నా చేతులు కుదుపుతూ.

నేను మాటాడలేకపోయాను. నా ముఖంలో ఏ భావాలు వ్యక్తమౌతు న్నాయో నాకు తెలియదు. నా చూపులు మాత్రం ఆయన ముఖాన్నంతా తడుముతున్నాయి. అది గ్రహించి ఆయన అన్నారు.

"మీరు భయపడకండి. నేను చాలా మొండివాడిని. కాగా ఏమేనా జరిగితే మంచికే గాని చెడుకు జరగదు. ఉత్తరాలు రాస్తూ ఉండండి – నేను రాయక పోయినా" పెట్టె వంకకు నడిపిస్తూ అన్నారు.

అచిర కాలంలోనే ఆయనా నేనూ దూరం కాసాగాము – రెండేసి నిముషాలకో మైలు దూరం – ఆయన విశాఖపట్నంలోనూ నేను రైల్లోనూ.

## 5

ఇంటికి వచ్చిన రెండు మూడు రోజులనాడు గాని జరిగినదానికి ఒక అర్థం చెప్పుకోలేకపోయాను. ఈరోజుల్లో కూడా, కూతుర్ని కాపురానికి దూరంచేసి, అల్లుళ్ళను దారికి తేవాలనుకునే అత్తమామ లుండడం ఆశ్చర్యమే అనిపించింది.

రాజశేఖరానికి వరసగా ఉత్తరాలారంభించేను. నాల్గో ఉత్తరానికి జవాబు వచ్చింది. నా ఉత్తరంతో పాటు నా చిరునామాతో కవరు వుంచేను. ఆయన చాలా అనుతాపంతో జవాబు రాశారు! ఉత్తరం చూడగా ఆయన మానసిక ఆరోగ్యము బాగానే వున్నట్టనిపించింది. తరవాత ఏవో పనులలో పడి నేనూ రాయడం పడింది కాదు.

రెణ్నెళ్ళ క్రితం ఒక సాయంకాలం నేను ఆఫీసు నుండి యింటికి బయలుదేరుతుండగా రాజశేఖరంగారి అన్నగారు మా ఆఫీసుకు వచ్చారు. ఆయనను నేను ఎరుగుదును.

ఆయన వచ్చి "తమ్ముడు ఎక్కడ వున్నాడో మీకు తెలుసా అన్నారు". కొన్న తడబడే ప్రశ్నలూ, ఆశ్చర్యాలూ, జవాబులూ అయిన తరువాత – "మా తమ్ముడు పరారీ అయ్యాడు" అన్నారు అన్నగారు.

దగ్గర మూడు వందల వరకు మొత్తమైన అప్పుల జాబితా, గది తాళాలూ పోస్టుద్వారా పంపిస్తూ వాటితో పాటు ఒక చిన్న ఉత్తరం ఉంచాడు. ఎక్కడకు పోయాడో తెలియదు.

ఆయన చూడమనగా అప్పుల జాబితా చూశాను. అందులో నా పేరు లేదు. ఉత్తరం చూపించారు. తన కోసం వెతకడానికి డబ్బు తగలెయ్యొద్దనీ వుత్తరాలు వ్రాస్తూ వుంటాననీ ఉన్నది. ఆస్తిని గురించి కొన్ని లెక్కలేవో వున్నవి.

దగ్గర స్నేహితుడనవటం వల్ల నాకేమేనా భోగట్టా తెలియవచ్చునని వచ్చారట. ఆయన ఆ రాత్రి మా యింట వుండి మర్నాడు వుదయం రైలు అందుకున్నారు.

రాత్రి వాళ్ళ కుటుంబ పరిస్థితుల గురించి చాలాసేపు చెప్పారాయన. తమ్ముడిది బాల్యం నుండీ లోతుగుండేనట. తిక్క వచ్చిందంటే పట్టలేముట. మామ కొంత నయంకాని అత్తకీ అల్లుడికీ అసలు పడదట. పిల్ల మూడు మూర్తులా తల్లేనట. పిల్లడు పోయాడుట. ఆ విషయం రాస్తే భార్యను చూడటానికైనా రాజశేఖరం పోలేదట. తాను కఠినంగా ఉత్తరం రాసి పోస్టుచేసిన మరునాడే తనకా తమ్ముడి దగ్గర్నుంచి ఈ ఉత్తరం వచ్చిందట.

విషయమంతా విని నిట్టూర్చాను.

రాజశేఖరంగారు ఏల ఇల్లు విడిచినారో అనే విషయం మీద సత్యసన్నిహితములో, సత్య దూరములో అయిన అభిప్రాయాలు కొన్ని ఏర్పరచుకో గలిగాను. కాని భవిష్యత్తులో ఆయన ఏం చెయ్యదలచుకున్నారో మాత్రం ఎంత ఆలోచించినా నాకు బోధపడలేదు. ఇంతట్లో ఆయన నుండి ఒక పెద్ద కవరు ఉత్తరం వచ్చింది.

చాలా ఆతృతతో విప్పి చదివాను. అప్రస్తుతములైన ఆద్యంతాలు విడుస్తే అది యిలా ఉంది.

.....................

నేనీ ఉత్తరం రాయడంలో ఆంతర్యాలు రెండు.

మొదటిది నా క్షేమం మీకు తెలియజేయడం. రెండవది, మూడేళ్ళ క్రితం మీరు వ్రాసిన ఉత్తరానికి జవాబివ్వలేదు, ఇప్పుడా సమాధానం ఇవ్వాలనిపించడం.

మానవుడు సామాజిక జీవి అనీ, అతని కష్టసుఖాలూ ఆనంద విషాదాలూ, లక్ష్యాలు సాధించటం, సాధించలేకపోవటం, అతని ప్రయత్నం ఒక్కదాని మీదే ఆధారపడి ఉండవనీ, ఎవని జీవితపగ్గాలు వాని చేతులలోనే ఉన్నట్టు కనిపించినా నిజానికవి అతని చేతులలో లేవనీ, బహుశా మీరు గ్రహించగలిగి ఉండరు. అందుకు కారణం, మీరిప్పుడు మళ్ళా పొరపడుతున్నట్టు, మీ ప్రయత్న లోపం ఒక్కటే కాదు. మీ పుట్టుక, మీ పుట్టుకకు ముందే మీకై ఏర్పడిపోయిన జీవనపథం యొక్క ప్రమేయం కూడా చాలా ఉంది.

జీవితం గురించి ఇంచుమించు మీకుండిన లాంటి అభిప్రాయాలే నాకూ ఉండేవి – ఆదిలో. కాని నా జీవితపు టనుభవాలు, వాని పరిశీలన అచిరకాలంలోనే నా పొరపాటును బయటపెట్టసాగాయి.

మా తల్లిదండ్రులు నాకెనిమిదేండ్లు నిండక ముందే మరణించారు. ఏ తత్ఫలితంగా నేను పడ్డ శారీరక మానసిక యాతనలు ఎన్నో ఉన్నవి. వానిని నివారించటానికి లేదా అదుపులో పెట్టడానికి నాకేమాత్రం అవకాశ మున్నదంటారు?

నేను అసహాయ స్థితిలో ఉన్న దశలో మా నాయనమ్మా, అన్నయ్యా, మేనమామా కలసి నా స్వభావానికే మాత్రమూ సరిపడని అమ్మాయితో నా వివాహం జరిపించారు. ఏ కించిత్తు ప్రేమా లేకుండా అనుక్షణం ఆమెతో ఘర్షణ పడుతూనే, ద్వేషిస్తూనే, నా సంస్కారానికీ, నీతిని గూర్చి నాకున్న అభిప్రాయాలకూ విరుద్ధంగా ఆమెతో కాపురం చేసి ఒక బిడ్డడి జన్మకు కూడా కారణమయ్యాను. ఇది ఎంతటి దుర్ఘటనా! ఈ దుర్ఘటనకు బాధ్యత నా ఒక్కడిదేనా? దీని నివారణకు నా ఒక్కడి పూనికా సరిపోతుందా?

మన జీవిత పగ్గాలు మన చేతులలో మాత్రమే లేవు.

ఈ సృష్టినంతటినీ ఏదో లేక ఏవో సూత్రాలకు లోబడి పాలించే ఒకానొక మహత్తరమైన శక్తి చేతిలో కొన్ని ఉన్నవి.

అలనాటి మేధావులు – ఏది సత్యం ఏదసత్యం, ఏది ధర్మం ఏదధర్మం, ఏది న్యాయం ఏదన్యాయం అంటూ మంచి చెడ్డలనుగూర్చి ఇదమిద్ధమని ఏకాభిప్రాయాలకు రాకుండానే పదుగురూ పది మార్గాల మానవ సంబంధాలనూ, ప్రవర్తననూ శాసించగా – ధర్మాన్నీ, నీతినీ, న్యాయాన్నీ గురించి ఎవరికి తోచిన రీతిలో వారర్థం చేసుకొని మనుష్యుల చేతలనూ, జీవితాలనూ విమర్శించి నడిపించే నేటి పెద్దల చేతిలో కొన్ని ఉన్నవి.

అన్నిటినీ మించి – చర్మ చక్షువులనేకాక జ్ఞాన చక్షువులను కూడా మోసగించగల మహత్తర ఇంద్రజాలం, సర్వేసర్వత్ర ప్రపంచం నేడాశ్రయించి ఉన్న ఆర్థిక విధానం, సర్వానర్థ హేతుభూతమైన ఆ ఆర్థిక విధానం చేతిలో చాలా ఉన్నవి.

మనచేతిలో ఉన్నది తక్కువలో అతి తక్కువ.

మీరు నా ఆర్థిక దుస్థితి చక్కబరచుకోవటానికి కొన్ని మార్గాలు సూచించారు జ్ఞాపకం ఉన్నదా? మీరు నాకు వ్రాయకముందే ఇంచుమించు అన్నింటినీ ప్రయత్నించి ఉన్నానంటే నమ్ముతారా?

ఏం ఖర్చులు తగ్గించమన్నారు నన్నూ? తిండా! బట్టా! ఇంటి అద్దా! మిగిలిన పాలూ పెరుగూ ఖర్చా! ఏది? ఏది? సంవత్సరాల కొలదీ ఆలోచించి జవాబు దొరకక విడిచిపెట్టుకొన్న ఆలోచనలివి.

ఆరేళ్ళ క్రితం శేరు బియ్యం వెల ఐదు అణాలు. పదహారౌన్సుల రేషన్ ఇచ్చేవారు. డెబ్బై రెండు రూపాయల జీతం సరిపోయేది.

ఇవాళ శేరు ఎనిమిదణాలు. రేషన్ ఎనిమిదౌన్సులు. మిగిలినవి బ్లాక్ మార్కెట్లో శేరు రూపాయిన్నరకు కొనుక్కోవాలి. పచారీ దినుసుల ధరలన్నీ బియ్యం రేటుకి పెరిగాయి.

ఏ నిష్పత్తిలో నా ఖర్చులు తగ్గించుకుంటే సరిపోతుందంటారు? నా ఆర్థిక దుస్థితిని చక్కచేసుకోవడం నా చేతిలోనే ఉందంటారా?

సరే ఆదాయం పెంచుకోవచ్చు. ఎలా? ఏం చేసి? పార్ట్‌టైమ్ జాబ్ చూసుకోనా? కోమటికొట్లో పద్దులు వ్రాశా? ప్రైవేటు చెప్పుకోనా? అన్నీ ప్రయత్నించాను. అన్నిటికీ ఇంతకు ముందే ఎవరో అమురుకొని ఉన్నారు. ఇలాటి ఊళ్ళల్లో ప్రత్యేకంగా వాటిమీదే ఆధారపడి జీవించే మనుషు లుంటారు.

ఇవన్నీ ఎలాటి ఊహలో చెప్పనా? కోతులు మిణుగురు పురుగులను పట్టుకొని చలికాచుకొన ప్రయత్నించటం వంటివి. నేను మీకన్నా పిచ్చి పిచ్చి ఊహలకు పోయాను. చాలాకాలం యాతనలు పడి పడి ఆలోచనలకు నెట్టబడి తెలుసుకున్న విషయమది.

మానవుని సౌఖ్యానందాలు రెండు రకాల శక్తులపై ఆధారపడి ఉన్నవి. ఒకటి అధిమానవ శక్తులు. రెండు మానవ శక్తులు. మొదటి వానిని సుముఖం చేసుకోగలగటం గురించి నాకింకా సందేహాలున్నా రెండవ వాని గురించి నాకు కొన్ని అభిప్రాయాలున్నవి.

ఈ పృధివిపైగల సమస్త సంపదల మీదా భూమిని పుట్టిన జీవరాసుల న్నింటికీ సమానమైన హక్కున్నది. తమ స్వార్థం దురాశా హేతువులుగా బలవత్తరమైన జీవులు కొన్ని బలహీనమైన వానిని వంచించి అన్యాయం చేస్తున్నవి. ఇతర జీవరాసులలో అతి తక్కువగా కనిపించే యీ లక్షణం మానవులలో అతి ఎక్కువగా స్పష్టంగా కనిపిస్తున్నది.

మానవుడు పుట్టినదాది నేటివరకూ యీ అన్యాయాన్ని అరికట్టడానికి అవిరామంగా ప్రయత్నం జరుగుతూనే ఉన్నది. దాని ఫలితమే ఇన్నిన్ని మతాలు, ఇన్నిన్నిరకాల ప్రభుత్వాలు, వాటి న్యాయశాస్త్రాలు, మహామహులు, సృష్టించిన కళలు, సాధించిన విజ్ఞానం, నేర్చిన తంత్రాలు, సాగించిన పోరాటాలు.

కాని ఇవన్నీ ముసుగులో గుద్దులాటలుగానే సాగుతూ వచ్చాయి. నవయుగం దీనిని బహిరంగం చేసింది.

ఇప్పుడు నా జీవితపు దుస్థితికి హేతువు తెలుసుకున్నాను. నేటి మానవ సమాజంలో–

అటు కండలు కరిగించి సంపదనుత్పత్తి చేసేవారూ, ఇటు మేధాశక్తి వినియోగించి సృజన శక్తులను అభివృద్ధి

పరిచేవారూ, యీ యిరు తెగల వారి జీవనం ఉన్నంతలో సుఖంగా గడిచేందుకు సేవలందించేవారూ, – వీరందరూ సమాజ సంపదలో అతి తక్కువ పొందుతూ అర్థాకలితో అణచుకున్న కోర్కెలతో బ్రతుకుతున్నారు. వారి శ్రమజన్యమైన సంపదలో ఎక్కువ భాగం మరికొందరు అనుభవిస్తున్నారు.

ఈ వలపక్షపు పంపకంలో ఎక్కువ ఫలితం అనుభవించే వారి యోగ్యత ఎట్టిదో తెలుసా?

సంపద సృష్టిలో వారు చేసే శారీరక పరిశ్రమ గాని మానసిక శ్రమగాని వీసమెత్తుండదు. వీరిలో ఏ కొద్దిమందో తప్ప చాలా మంది లభించేటప్పుడు తమకు ఆ సంపదలు ఎలా లభిస్తున్నాయో, పోయేటప్పుడు ఎలా పోతున్నాయో కూడా ఊహించలేనంత మందబుద్ధులు.

ఈ ఇంద్రజాలం కంతటికీ కారణం ఇప్పుడు మానవుడనుసరిస్తున్న ఆర్థిక విధానం.

ఈ జూదగొండి ఆర్థిక విధానం హస్తాలలో ఇరుక్కొని ఉన్నంతకాలం మన జీవితాలను మన ప్రయత్నంలో ఆనందమయంగా చేసుకోలేము.

మీరేమంటారూ? కోరికలను చంపుకోమంటారు. మనకన్నా తక్కువ వారిని చూసి వాళ్ళకు లేనిది మనకున్నందుకు గర్వించమంటారు. కలవానిని చూసి అసూయ పడరాదంటారు.

అవి మీరు ఆలోచించి చెప్పినవి కావు. చెప్పగా విని చెప్పేవి.

శోచనీయమేమంటే – ఈ ప్రచారం అర్థాకలితో మాడుతూ కోరికలు కొనసాగించుకోలేని వారు తమలో తాము చేసుకోవటం, నిస్పృహ వంకకు పరుగులెత్తడం.

సంపద నధికంగా అనుభవించే వారు మనకన్నా ఏవిధంగా అర్హులని వీరెవ్వరూ ఏల ఆలోచించరో తెలియదు. తమ భాగం పొందటానికి మార్గమేమిటని ఆలోచించరు.

మనుష్యులు దైవభీతీ, పాపభీతీ పోగొట్టుకున్నారు. అధర్మ భీతి పేరుతో ధర్మాన్ని చూసి ఏల భయపడతారో తెలియదు.

మరికొందరు ధర్మాధర్మాలను గుర్తెరిగినా, అంతరంగంలో ధర్మపక్ష విజయాన్నే కాంక్షిస్తున్నా సమయం వచ్చేసరికి కురువృద్ధుల్లా అధర్మపక్షాన నిలబడి ఏల పోరాడతారో తెలియదు.

ఇంకేం చెప్పను?

తక్కిన విషయాలు తెలిసే ఉంటాయి.

...............

--అంటూ మరో రెండు వాక్యాలతో ఉత్తరం ముగిసిపోయింది.

ఎటువంటి మనిషి ఏ స్థితిలో ఎక్కడ మునిగి ఎక్కడ తేలాడో ఆలోచిస్తూ నేనలాగే దిగాలుపడి కూర్చున్నాను.

★

*(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక: మార్చి 1953)*